# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 68 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | మంగళవారం 29 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 68 29-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-




పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ


2 లో..

## మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం..

-రాజధాని పున:నిర్మాణ పనులతో అభివృద్ధికి మళ్లీ ఊపిరి

-త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు

-ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



**అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

అమరావతి రాజధాని పనుల పున:ప్రారంభానికి మే 2న రాష్ట్రానికి వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకడంతో పాటు సభను విజయవంతం చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా నేతలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని మోదీ పర్యటనపై ఎన్డీఏ నేతలతో సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. "ఒక కుటుంబం నివసించేందుకు మంచి ఇల్లు ఉండాలని ఎలా అనుకుంటామో ప్రజలు గర్వంగా చెప్పుకోవడానికి కూడా రాజధాని ఉండాలి. అభివృద్ధి వికేంద్రీకరణ ఎన్డీఏ విధానం కాబట్టే 2014 నుంచి కేంద్ర విద్యా సంస్థలు ఉత్తరాంధ్ర, కోస్తా, సీమ జిల్లాల్లో ఏర్పాటు చేశాం. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం. తెలంగాణకు హైదరాబాద్, కర్నాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై రాజధానుల ద్వారా 70 శాతం ఆదాయం వస్తోంది. మనకు కూడా మంచి నగరం ఉంటే రాష్ట్రానికి సమృద్ధిగా ఆదాయం సమకూరుతుందని అమరావతిని నిర్మిస్తున్నాం. రాష్ట్రానికి అమరావతి ఆత్మ వంటిది" అని చంద్రబాబు వివరించారు. "రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారు. వారు ఇచ్చిన భూముల్లోనే రాజధాని నిర్మించడంతో పాటు తిరిగి వారికి రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్లు

- తరువాయి 2లో..




## భారత్ జోలికి వస్తే ... మటాష్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

-సిఎం చంద్రబాబు

**అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

హైదరాబాద్ లో 14 నెలల్లో హైటెక్ సిటీ పూర్తి చేశామని, భవిష్యత్ అంతా ఐటీదేనని అపట్లో పిలుపు ఇచ్చానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సోమవారం విట్ కాలేజ్ లో వి.లాంచ్ ప్యాడ్‌లో-2025 స్టార్ట్ అప్ ఎక్స్ పో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ బ్లాక్, వి.వి.గిరి బ్లాక్, దుర్గాబాయి దేశముఖ్ బ్లాక్ నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా భారతీయులుంటారని, అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారని అన్నారు. తెలుగువాళ్ల జనాభా 5 శాతమే.. ఐఐటీల్లో సీట్లు మాత్రం 20 శాతం మనోళ్లవే అని వ్యాఖ్యానించారు.

మే 2న ప్రధాని మోదీ అమరావతికి వస్తున్నారని, ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోందని సీఎం చంద్రబాబు అన్నారు. అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశానని, ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నానని అన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేదని, ఇప్పుడు ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉందని అన్నారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్లు వస్తున్నాయని చంద్రబాబు అన్నారు.

భారత్ జోలికి ఎవరైనా వస్తే మటాష్ అయిపోతారని, భారత్‌ను ఉగ్రవాదం ఏం చేయలేదని సీఎం అన్నారు. రాబోయే రోజుల్లో భవిష్యత్ అంతా ఏఐ దేనని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా

- తరువాయి 2లో..




## అదీ భారత్ సత్తా

### -పహల్గాంలో మళ్ళీ పర్యాటక సందడి




**న్యూఢిల్లీ ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

26 మంది ప్రాణాలను బలిగొన్న విధ్వంసకర ఉగ్రవాద దాడి జరిగిన కొన్ని రోజుల తర్వాత పహల్గాంలో ఎవ్వరూ ఊహించని దృశ్యం ఆవిష్కృతమైంది. భారీ సంఖ్యలో పర్యాటకులు, జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం లోయకు చేరుకుంటున్నారు. అక్కడ క్రమంగా టూరిస్టుల సంఖ్య సాధారణ స్థితికి చేరుకుంటోంది. మునుపటితో పోలిస్తే పర్యాటకుల సంఖ్య కొంత తగ్గినప్పటికీ, ఈ ప్రాంతం మరోసారి దేశీయ, అంతర్జాతీయ సందర్శకులతో అలరారుతుండటం విశేషం.

కోల్‌కతా, బెంగళూరు నుండి వచ్చిన సందర్శకులను పలుకరించినపుడు జమ్ము కశ్మీర్ యొక్క భద్రతపై విశ్వాసం వ్యక్తం చేశారు. కొంచెం ఆందోళన ఉన్నప్పటికీ, చాలా మంది పహల్గాం సందర్శనతో సహా వారి టూర్ ప్లాన్ ప్రకారమే ముందుకు సాగుతున్నారు. "కాశ్మీర్ ఇప్పుడు సురక్షితంగా ఉంది. ప్రతి దుకాణం, టూరిస్ట్ సేవలు తెరిచే ఉన్నాయి. పర్యాటకులు సురక్షితంగా ఉన్నారు. అందరూ వస్తున్నారు కాబట్టి మీరు కూడా ఎలాంటి భయం లేకుండా దయచేసి రండి" అని కోల్‌కతాకు చెందిన

- తరువాయి 2లో..



## కేరళ ముఖ్యమంత్రి కార్యాలయానికి బాంబు బెదిరింపు

- కేరళ సీఎంఓతో పాటు సచివాలయానికి బాంబు బెదిరింపులు
- కొచ్చి ఎయిర్‌పోర్టుకు సైతం ఇదే మాదిరి బెదిరింపులు
- ఆయా ప్రదేశాలకు చేరుకుని బాంబ్ స్క్వాడ్, పోలీస్ బృందాలు గాలింపు చర్యలు
- గత రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ ఆఫీస్‌లకు వరుస బాంబు బెదిరింపు కాల్స్



**కేరళ ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

కేరళ ముఖ్యమంత్రి కార్యాలయంతో పాటు సచివాలయానికి నేడు బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అటు, కొచ్చి ఎయిర్‌పోర్టుకు

- తరువాయి 2లో..

## హామీ నిలబెట్టుకున్నాం

### చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్



- చేపల వేట నిషేధ భృతిని రూ. 10 వేల నుంచి రూ. 20 వేలకు పెంచిన కూటమి ప్రభుత్వం
- శ్రీకాకుళంలో పథకాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- హామీ నెరవేర్చడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం

**అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ లోని మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక భృతిని రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గతంలో వేట నిషేధ సమయంలో

- తరువాయి 2లో..

## ఏపీకి వర్ష సూచన..

### తెలంగాణలో ఎండ తీవ్రత

**ఏపీలోని పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు**

**తెలంగాణలో 40 డిగ్రీలు దాటనున్న ఉష్ణోగ్రతలు**

**ఉభయ రాష్ట్రాల్లో భిన్న వాతావరణం**



**అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ లోని పలు జిల్లాల్లో రాగల మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, ఏలూరు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో సోమవారం (నేడు) పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. మంగళవారం నాడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడవచ్చని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం రాయలసీమలోని పలు ప్రాంతాల్లో

- తరువాయి 2లో..

తెలుగురాష్ట్రం
దినపత్రిక

## సంపాదకీయం

# ప్రమాద ఘంటికలు

మహారాష్ట్రలోని మరాఠ్వాడా ప్రాంతంలో అన్నదాతల ఆత్మహత్యలు గత ఏడాది తొలి మూడు నెలలతో పోల్చితే ఈ సంవత్సరం అదే కాలంలో 32 శాతం పెరిగాయన్న వార్త ప్రమాద ఘంటికల్ని మోగిస్తోంది. మరాఠ్వాడా ప్రాంతంలోని 8 జిల్లాల్లో ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మధ్య 269 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. అధికారిక నివేదిక ప్రకారం.. గతేడాది ఇదే కాలంలో 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో పోలిస్తే ఈ సారి రైతన్నల ఆత్మహత్యలు 32 శాతం పెరగడం ఆందోళనకరం. బీడ్ జిల్లాలో ఈ కేసులు అత్యధికంగా పెరిగాయి. 2024 మొదటి మూడు నెలల్లో 44 రైతు ఆత్మహత్యలు నమోదు కాగా ఆ సంఖ్య 2025లో 71 కి పెరిగింది. అంటే 61.36 శాతం పెరిగిందన్నమాట! అన్నదాతల ఆత్మహత్యలకు పంటలు దెబ్బతినడం, పండిన చోట కూడా ధరలు గిట్టుబాటు కాక వెరసి ఆర్థిక ఇబ్బందులే కారణమని వార్తా కథనాలు వెల్లడిస్తున్నాయి. కాబట్టి డబుల్ ఇంజన్ సర్కారుగా గొప్పలు చెప్పుకొనే మహాయుతి పాలన అక్కడి రైతులను తీవ్ర కష్టాల్లోకి నెడుతున్నదని స్పష్టమవుతోంది. ఓట్ల కోసం 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుల రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం దానిని అమలు చేయకపోవడం మోసపూరితం. పంట రుణాల మాఫీకి వెంటనే చర్యలు చేపట్టాలన్న రైతాంగ ఆందోళనలు, వాటికి ప్రతిపక్షాల మద్దతు పెరుగడంతో మరాఠ్వాడా రగిలిపోతోంది.

మహారాష్ట్రలో నేడు నెలకొన్న దుస్థితి రేపు ఆంధ్రప్రదేశ్‌లో కూడా తలెత్తే ప్రమాదం పొంచివుంది. గడచిన ఖరీఫ్‌లో రాష్ట్రంలోని 466 మండలాల్లో డ్రైస్పెల్ (బెట్ట) పరిస్థితులు నెలకొనగా ప్రభుత్వం కేవలం 54 మండలాలనే కరువు గా ప్రకటించింది. అనావృష్టి, కాల్వ చివరలకు సాగు నీరందక రాష్ట్రంలోని దాదాపు మూడింట రెండు వంతుల భూభాగంలో పంటలు పూర్తిగా నాశనం కావడమో దెబ్బతినడమో జరిగింది. పులి మీద పుట్రలా తుఫాను, వరద నష్టాలు. వీటన్నిటితో పంట నష్టం సంభవించగా ఆమాత్రం పండిన పంటలకు సైతం గిట్టుబాటు ధర లేని పరిస్థితి. 2023-24 సీజన్ తో పోల్చితే 2024-25 ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు, డబ్బు చెల్లింపు మెరుగు పడినా తాజా రబీలో ఆ పరిస్థితి కనిపించడంలేదు. వ్యాపార పంటల్లో ముఖ్యమైన మిర్చి కొనుగోళ్లు, ధర గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్‌లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకుంటాయని ఘనంగా చెప్పారేతప్ప ఇంకా ఏ రైతుకూ ఒక్క రూపాయి కూడా చెల్లించలేదు. అసలు ఆ స్కీమ్‌కి సంబంధించిన నిర్దిష్ట మార్గదర్శకాలు కూడా ఇప్పటికీ విడుదల చేయకపోవడం పాలకుల చిత్తశుద్ధి లేమికి నిదర్శనం. మిగిలిన పంటల ధరలు కూడా రైతుకు సానుకూలంగా లేవు.

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తే ప్రమాద తీవ్రత అర్థం అవుతుంది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో రైతులు, కౌలు రైతులు పంట నష్టాలు, అప్పుల భారాన్ని తట్టుకోలేక తనువు చాలిస్తున్న వార్తలు వస్తున్నాయి. విషాదకరమైన ఈ పరిణామం రానున్న రోజుల్లో మరింత పెరిగే ప్రమాదమూ ఉంది. కరువు ప్రకటించిన మండలాల్లో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న భోజనం పెడతామని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. అది కూడా ఒక న్యాయవాది వేసిన పిల్ మూలంగా వచ్చిన ప్రకటనేతప్ప తనంతట తానుగా చేసింది కాదు. కరువు, వరద బాధిత రైతాంగానికి పంటల బీమా పరిహారం గానీ ఇన్‌పుట్ సబ్సిడీ కానీ చెల్లించలేదు. ఇక కేంద్రం నుండి రావలసిన వరద, తుఫాను సహాయం కూడా అంతంత మాత్రమే! అంతో ఇంతో సహాయకారిగా వున్న 'ఉపాధి' పనుల కల్పన కూడా మందగించింది. పైపెచ్చు అందులో వేతన భాగం తగ్గి, మెటీరియల్ భాగాన్ని పెంచడంవల్ల ఆపన్నులకు పనులు లభించడం లేదు. చేసిన పనులకూ దినసరి వేతనం గత ఏడాదితో పోల్చితే 52 రూపాయలు తగ్గడం దారుణమైన విషయం. వేతన బకాయిలు షరా మామూలే! రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని గ్రామీణ ప్రజలను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం తనకు తాను పూనుకోకపోతే ప్రజా సంఘాలు ఉద్యమాల ముల్లుగర్రతో పొడవాలి. లేకపోతే రాష్ట్రంలోని వెనుకబడిన కరువు పీడిత ప్రాంతాల్లో మరాఠ్వాడా లాంటి దుస్థితి

# పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డును అందుకున్న బాలయ్య
### సినీ రంగానికి, సమాజానికి అందించిన సేవలకు గుర్తింపుగా పద్మభూషణ్ పురస్కారం
### ఈ కార్యక్రమానికి హాజరైన బాలకృష్ణ కుటుంబ సభ్యులు

అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన పౌర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ సంప్రదాయ తెలుగు వస్త్రధారణ అయిన పంచెకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. ారతీయ సినిమా రంగానికి, సమాజానికి నందమూరి బాలకృష్ణ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఈ పద్మ భూషణ్ అవార్డును ప్రకటించిన విషయం విదితమే. నటుడిగా చిత్ర పరిశ్రమకు చేసిన సేవలతో పాటు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. దివంగత ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు నందమూరి తారక రామారావు వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ, తన సుదీర్ఘ కెరీర్‌లో వందకు పైగా చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇప్పటికీ యువ కథానాయకులకు దీటుగా వరుస సినిమాల్లో నటిస్తూ తన ఉత్సాహాన్ని చాటుకుంటున్నారు. మాస్, యాక్షన్ చిత్రాలతో పాటు, పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలలో కూడా తనదైన నటనతో మెప్పించారు. గతంలో కూడా ఆయన అనేక ఫిలింఫేర్, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలు అందుకున్నారు.



# మోదీ అమరావతి పర్యటన విజయవంతం చేద్దాం..

అభివృద్ధి చేసి ఇస్తున్నాం. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నాం. రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు వస్తాయి. రోడ్ల నిర్మాణం జరిగితే రవాణా సౌకర్యం పెరగడంతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. కానీ కొన్ని వ్యతిరేక శక్తులు కుట్రతో ప్రజలను కావాలనే తప్పుదోవ పట్టిస్తాయి. అభివృద్ధిపై బురద జల్లే ప్రయత్నం చేస్తుంటాయి. మనం ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు చేస్తున్న మంచి పనులను గురించి కూడా వివరించాలి. ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు తెలియజేయాలి. ఇబ్బందులను అధిగమిస్తూనే సంక్షేమం, అభివృద్ధి బాటను వీడటం లేదు" అని తెలిపారు.

"అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ మెందుకెళ్తున్నాం. పోలవరానికి నిధులు, విశాఖ రైల్వేజోన్ మంజూరు, స్టీల్ ప్లాంట్‌కు రూ.11,400 కేంద్రం కేటాయించింది. యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే మత్స్యకారుల సేవలో, ఎస్సీ వర్గీకరణ, అన్నక్యాంటీన్లు, పింఛన్లు, 3 గ్యాస్ సిలిండర్లు అందించడంతో పాటు 16,347 ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. వచ్చే నెల రైతులకు అన్నదాత కింద పెట్టుబడి సాయం అందిస్తాం" అని ప్రకటించారు.


"రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. 175 నియోజకవర్గాల్లోనూ రాబోయే రోజుల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి చేసి వన్ ఫ్యామిలీ... వన్ ఎంట్రప్రెన్యూర్ సాకారం దిశగా అడుగులు వేస్తాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం. ఎరైన్-కో రామాయపట్నంలో, అనకాపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ దిగ్గజ కంపెనీలు లక్ష కోట్లతో పెట్టుబడులు పెడుతున్నాయి. మిట్టల్ ప్లాంట్ పూర్తయితే రెండు స్టీల్ ప్లాంట్లు, దేశంలోనే ఎక్కువ స్టీల్ ఉత్పత్తి చేసే జిల్లాగా ఉమ్మడి విశాఖ రికార్డు సృష్టిస్తుంది. రాయలసీమను డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్స్, డ్రోన్, శాటిలైట్ లాంచింగ్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అభివృద్ధి చేస్తాం. రాయలసీమకు బెంగళూరు, హైదరాబాద్ అనుసంధాన హైవేలు, ఎయిర్ పోర్టులు అందుబాటులో ఉంటాయి. తద్వారా లాజిస్టిక్ హబ్‌గా రాయలసీమ మారుతుంది" అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.






### భారత్ జోలికి వస్తే ... మటాష్

పారదర్శకత తీసుకొచ్చామన్నారు. స్వర్ణాంధ్ర-2047కు రోడ్ మ్యాప్ సిద్ధం చేశామని చెప్పారు. పహల్గామ్‌లో ఉగ్రదాడి ఘటన దారుణమైందని, భారత్ జోలికి వస్తే మటాష్ అయిపోవాల్సిందేనని ఆయన మరోసారి స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ప్రజలు సంఘటితంగా ఉండాలని, తీవ్రవాదం సమస్యలు భారత్‌ను ఏం చేయలేవని సీఎం చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్, తాడికొండ శాసన సభ్యులు తెనాలి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## అదీ భారత్ సత్తా

## -పహల్గాంలో మళ్ళీ పర్యాటక సందడి

ఒక పర్యాటకుడు కిక్కిరిసిన వ్యాన్ పక్కన నిలబడి అరుస్తూ కనిపించడం తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన టూరిస్ట్ మహ్మద్ అనాస్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

"ఆందోళన చెందడానికి ఏమీ లేదు. సైన్యం, ప్రభుత్వం, స్థానికులు మాతో ఉన్నారు. మా భద్రతకు అండగా ఉంటున్నారు. దుర్ఘటన తర్వాత మేము భయపడ్డాం, వెంటనే వెనక్కి బయలుదేరాలని అనుకున్నాము. కానీ స్థానికులు, సైన్యం మమ్మల్ని ప్రేరేపించారు. అందుకే మేము మా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాం" అని మహ్మద్ అనాస్ అన్నారు. దాడి తర్వాత తాము భయపడలేదని, అసౌకర్యంగా కూడా భావించలేదని విదేశీ పౌరులు అంటున్నారు. తరచుగా వచ్చే సందర్శకులు కూడా ఇక్కడ అంతా బాగానే ఉందని చెబుతున్నారు.

### కేరళ ముఖ్యమంత్రి కార్యాలయానికి బాంబు బెదిరింపు

సైతం ఇదే మాదిరి బెదిరింపులు వచ్చినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో బాంబ్ స్క్వాడ్, పోలీస్ బృందాలు ఆయా ప్రదేశాలకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గడిచిన రెండు వారాలుగా కేరళలోని ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తున్నాయి. ఇలా రెండు వారాల్లో ఏకంగా 12 బాంబు బెదిరింపు కాల్స్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కేరళ హైకోర్టు సహా జిల్లా కలెక్టరేట్‌లు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాలకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. నిన్న తిరువనంతపురం విమానాశ్రయంతో పాటు నగరంలోని పలు ప్రముఖ హోటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు తెలిపారు. దాంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్‌లు ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్‌లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అయితే, ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. దాంతో అవి నకిలీ బెదిరింపు కాల్స్‌గా గుర్తించామని పేర్కొన్నారు. ఇక, మే 2న రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ నకిలీ కాల్స్ పై పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

## హామీ నిలబెట్టుకున్నాం

మత్స్యకారులకు రూ. 10,000 భృతిగా అందేది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ మొత్తాన్ని రూ. 20,000కు పెంచినట్లు పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల హామీని కార్యరూపం దాల్చేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. "మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. వేట నిషేధ భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పెంచిన భృతి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పెంపుదల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 259 కోట్లను కేటాయించిందని వెల్లడించారు. మత్స్యకారుల వలసలను తగ్గించి, స్థానికంగానే వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పవన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘమైన సముద్ర తీరం ఉందని, ఈ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## ఏపీకి వర్ష సూచన..

### తెలంగాణలో ఎండ తీవ్రత

వర్షాలు కురవగా.. అనకాపల్లి జిల్లా రావికమతం, వైఎస్సార్ జిల్లా వేంపల్లిలో 41.4 డిగ్రీలు, విజయనగరం జిల్లా గుర్లలో 41.2 డిగ్రీలు, తూర్పుగోదావరి జిల్లా మురమండ, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. సోమవారం ఉదయం మెదక్ లో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వాతావరణ శాఖ వెల్లడించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని రాజేంద్రనగర్ లో 35 డిగ్రీల టెంపరేచర్ నమోదైందని అధికారులు తెలిపారు. మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, భద్రాచలం, రామగుండం, నిజామాబాద్, హనుమకొండ జిల్లాల్లో 36 నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.

# విశాఖ మేయర్‌గా పీలా శ్రీనివాసరావు

## గ్రేటర్ విశాఖ 3వ మేయర్‌గా బాధ్యతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**విశాఖ మహానగర పాలక మేయర్‌గా పీలా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. జీవీఎంసీ పాలకవర్గ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి.. కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరయ్యారు. జీవీఎంసీ మేయర్‌గా కూటమి అభ్యర్థి, తెదేపా కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికైనట్లు జాయింట్ కలెక్టర్ ప్రకటించి.. ఆయనకు ధ్రువపత్రం అందజేశారు.**



మహా విశాఖ నగర పాలక సంస్థకు 2021లో ఎన్నికలు జరిగినప్పుడు తెదేపా అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావు పేరును అధిష్ఠానం ప్రకటించింది. అప్పట్లో మెజార్టీ లేకపోవడంతో 'పీలా'కు పదవి దక్కలేదు. నాలుగేళ్ల పాటు పార్టీ బలోపేతానికి చేసిన కృషితో పాటు, వైకాపా ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడిన పీలా శ్రీనివాసరావుకు పార్టీ అధిష్ఠానం మరోసారి అవకాశం కల్పించింది.

### గుంటూరు మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర..

గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. కూటమి బలపరిచిన రవీంద్రకు 34, వైకాపా మద్దతిచ్చిన వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. దీంతో మేయర్‌గా కూటమి అభ్యర్థి గెలిచినట్లు ప్రిసైడింగ్ అధికారి భార్గవ్ తేజ ప్రకటించారు.

### కుప్పం పురపాలిక ఛైర్మన్ పదవి తెదేపా కైవసం..

కుప్పం పట్టణం: చిత్తూరు జిల్లా కుప్పం పురపాలిక ఛైర్మన్ ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఐదో వార్డు కౌన్సిలర్ సెల్వరాజ్‌ను తెదేపా అభ్యర్థిగా, 9వ వార్డు సభ్యుడు ఎస్ డీ హాఫీజ్‌ను వైకాపా ప్రతిపాదించింది. తెదేపా అభ్యర్థి సెల్వరాజ్‌కు 15 ఓట్లు, వైకాపా అభ్యర్థి హాఫీజ్‌కు 9 ఓట్లు వచ్చాయి. దీంతో సెల్వరాజ్ గెలుపును ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి శ్రీనివాసరాజు ధ్రువీకరించారు. దీంతో కుప్పంలో తెదేపా కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కాకినాడ జిల్లా తుని పురపాలక ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ పీఠాన్ని తెదేపా దక్కించుకుంది. ఛైర్‌పర్సన్‌గా నార్ల భువన సుందరి.. వైస్ ఛైర్మన్‌గా ఆచంట సురేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు వైకాపా కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పదవిని తెదేపా కైవసం చేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ ఛైర్‌పర్సన్‌గా ఆకుల మల్లీశ్వరి ఎన్నికయ్యారు.



## టెక్నాలజీ రంగంలో దూసుకెళ్తున్న ఏపీ

### ఎంపీ కేశినేని శివనాథ్

విజయవాడ, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దేశంలోనే అగ్రగామి పారిశ్రామిక శక్తిగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకుందని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్, ఏరోస్పేస్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ పాలసీ, క్లస్టర్ల రూపకల్పన కోసం మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ కార్యక్రమం జరిగింది. మీట్ విత్ స్టేక్ హోల్డర్స్ సదస్సులో ఎంపీ కేశినేని శివనాథ్ పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు విజన్ 2020 వల్ల ఏపీ టెక్నాలజీ రంగంలో అభివృద్ధి పథంలో సాగుతోందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి ప్రాంతంలో విమానయానం, రక్షణ రంగాల్లో కేంద్రాలను అభివృద్ధి చేస్తున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యంగా దేశంలోనే వందశాతం రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి కృషి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రానికి సలహాదారులుగా ఉన్న డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి, ఇస్రో మాజీ చైర్మన్ సోమనాథ్ అనుభవం చాలా అవసరమని అన్నారు. రాష్ట్రం భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో పారిశ్రామిక జోన్లు ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేయడానికి విధివిధానాలు రూపొందిస్తున్నామని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక విప్లవంలో భాగస్వాములు కావాలని స్టేక్ హోల్డర్స్‌కు ఆహ్వానం పలుకుతున్నామని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

# చెత్త సేకరణకు ప్రాధాన్యం

## మంత్రి నారాయణ

విజయవాడ ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చెత్త సేకరణకు మున్సిపల్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి నారాయణ తెలిపారు. సోమవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో కెపాసిటీ బిల్డింగ్, బిహేవియరల్ చేంజ్‌పై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వర్క్ షాప్‌నకు మంత్రి నారాయణ, కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. మున్సిపాలిటీల్లో సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ తొలగించడం ఎంతో సవాల్‌తో కూడినదని అన్నారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో 6500 టన్నుల సాలిడ్ వేస్ట్ ప్రతి రోజూ వస్తుందని చెప్పారు. ఏరోజు కారోజు ఈ చెత్తనంతా తొలగించాలని అన్నారు. గత జగన్ ప్రభుత్వం 80 లక్షల టన్నుల చెత్తను వదిలి వెళ్లిందని మంత్రి నారాయణ అన్నారు. ఈ చెత్తనంతా వచ్చే అక్టోబర్ 2వ తేదీ నాటికి తొలగించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని మంత్రి నారాయణ తెలిపారు. ప్రతి మూడో శనివారం స్వచ్ఛంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తూ స్వయంగా సీఎం చంద్రబాబు పాల్గొంటున్నారని గుర్తుచేశారు. స్వచ్ఛత ప్రాధాన్యం తెలిసేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజలకు అవగాహన ఎలా కల్పించాలి.. ఎలాంటి ప్రచారం నిర్వహించాలనే దానిపై అధికారులు రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. దేశంలో ఎక్కడికి వెళ్తున్నా అక్కడ వ్యర్థాల విషయంలో ఆయా ప్రభుత్వాలు తీసుకున్న ఉత్తమ విధానాలను ఏపీలో అమలు చేసేలా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. నాలుగు థీమ్‌లుగా పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. చెత్తపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించడం, రీసైక్లింగ్‌పై చైతన్యం కలిగించాలని అన్నారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త పడవేసే అలవాట్లు మార్పు చేయడం లాంటివి చేపట్టాలని మంత్రి నారాయణ సూచించారు.



# వెలుగుబాట పట్టిన ప్రజారాజధాని

**పునర్నిర్మాణానికి అమరావతి సిద్ధమంటూ వీడియో పోస్టు చేసిన లోకేశ్**

అమరావతి: స్వయం సమృద్ధి ప్రాజెక్టయిన ప్రజారాజధాని అమరావతి ఐదేళ్ల గ్రహణం నుంచి బయటపడి మళ్లీ వెలుగుబాట పట్టిందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. గ్రహణం ఎంతో కాలం ఉండదన్నారు. పునర్నిర్మాణానికి సిద్ధం అవుతున్న అమరావతి అంటూ ఎక్స్‌లో అరనిమిషం నిడివిగల ఓ వీడియోను పోస్టు చేశారు.




2014–19 మధ్య రాజధానిలో పూర్తయిన హైకోర్టు, అసెంబ్లీ, సచివాలయ భవనాలు, ఉండవల్లి గుహలు, వెంకటపాలెంలో తితిదే సహకారంతో నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం, విట్, ఎస్‌ఆర్‌ఎం, అమృత లాంటి విద్యాసంస్థలు, సీడ్ యాక్సిస్ రోడ్డు, రాజధాని మీదుగా వెళ్లే విజయవాడ పశ్చిమ బైపాస్, కృష్ణా నది మీద కట్టిన వంతెన, అసంపూర్తిగా మిగిలిన నిర్మాణాలు తదితరాల్ని వీడియోలో చూపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన జంగిల్ క్లియరెన్స్‌నూ ప్రస్తావించారు.

# ఏపీలో డీసీసీబీ, డీసీఎంఎస్ పోస్టులను భర్తీ చేసిన ప్రభుత్వం




అమరావతి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏపీలో పలు నామినేటెడ్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. 10 జిల్లాలకు సహకార బ్యాంకు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సంఘాల (డీసీఎంఎస్) ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. డీసీసీబీ ఛైర్మన్లు వీళ్లే.. విశాఖ డీసీసీబీ ఛైర్మన్‌గా కోన తాతారావు(జనసేన)

విజయనగరం డీసీసీబీ ఛైర్మన్‌గా కిమిడి నాగార్జున(టీడీపీ)
గుంటూరు డీసీసీబీ ఛైర్మన్‌గా మాకినేని మల్లికార్జునరావు(టీడీపీ)
కృష్ణా డీసీసీబీ ఛైర్మన్‌గా నెట్టెం రఘురామ్(టీడీపీ)
నెల్లూరు డీసీసీబీ ఛైర్మన్‌గా ధనుంజయరెడ్డి(టీడీపీ)
చిత్తూరు డీసీసీబీ ఛైర్మన్‌గా అమాస రాజశేఖర్ రెడ్డి(టీడీపీ)
అనంతపురం డీసీసీబీ ఛైర్మన్‌గా కేశవరెడ్డి(టీడీపీ)
కర్నూలు డీసీసీబీ ఛైర్మన్‌గా డి.విష్ణువర్ధన్ రెడ్డి(టీడీపీ)
కడప డీసీసీబీ ఛైర్మన్‌గా బి.సూర్యనారాయణరెడ్డి(టీడీపీ)

డీసీఎంఎస్ ఛైర్మన్లు వీళ్లే..

శ్రీకాకుళం %–% అవినాష్ ఛౌదరి (తెదేపా)
విశాఖ %–% కొట్ని బాలాజీ (తెదేపా)
విజయనగరం %–% గొంప కృష్ణ (తెదేపా)
గుంటూరు %–% వడ్రాణం హరిబాబు (తెదేపా)
కృష్ణా %–% బండి రామకృష్ణ (జనసేన)
నెల్లూరు %–% గొనుగోడు నాగేశ్వరరావు (తెదేపా)
చిత్తూరు %–% సుబ్రమణ్యం నాయుడు (తెదేపా)
అనంతపురం %–% నెట్టెం వెంకటేశ్వర్లు (తెదేపా)
కర్నూలు %–% జి.నాగేశ్వరయాదవ్ (తెదేపా)
కడప %–% యర్రగుండ్ల. జయప్రకాశ్ (తెదేపా)

# శ్రీకాళహస్తి చరిత్రలోనే భారీ ఆదాయం

**రూ.200 శీఘ్రదర్శనం క్యూలైన్లు నిండిపోయి బయట నిరీక్షిస్తున్న భక్తులు**

**శ్రీకాళహస్తి : వాయులింగేశ్వరుడు కొలువుదీరిన శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తజన సంద్రంగా మారింది. వేసవి సెలవులు, అందులోనూ ఆదివారం, అమావాస్య కలిసి రావడంతో ఆలయంలో మహాశివరాత్రిని తలపించిన రీతిలో భక్తులు తరలివచ్చారు. ముక్కంటి ఆలయ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఆదివారం ఒక్క రోజే రూ.కోటికి పైగా రాబడి వచ్చింది.**



ఉదయం నుంచి రాత్రి వరకు దాదాపు 32 వేల మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు భావిస్తున్నారు. ఇక 8,776 రాహు, కేతు పూజలు జరగగా, రూ.50 సర్వదర్శనం 4,109, రూ.200 శీఘ్రదర్శనం 5,769, రూ.500 అంతరాలయ దర్శన టికెట్లు 564 అమ్ముడుపోయాయి. కేవలం ఆర్జిత సేవల ద్వారా రూ.1.02 కోట్ల ఆదాయం రావడం ఇదే ప్రథమం. వేసవి తీవ్రత, భారీగా వచ్చిన జన సందోహంతో కొంత మేర ఇబ్బందులు తప్పలేదు. రోజంతా రద్దీ కొనసాగుతూనే వచ్చింది. అయినా అధికారుల సమన్వయంతో భక్తులకు సంతృప్తికరమైన దర్శనం కల్పించారు.




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక

https://epaper.teluguraastram.com

మంగళవారం 29 ఏప్రిల్ 2025



## మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపిన ఎన్డీఏ ప్రభుత్వం

**దేవ వరప్రసాద్**

**మలికిపురం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

మత్స్యకారులకు ప్రతి ఒక్కరికి 20 వేల రూపాయలు చొప్పున తమ ఖాతాలలో వేసి వారి జీవితాలలో ఎన్డీఏ ప్రభుత్వం వెలుగులు నింపిందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు.గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం 217 జీవోను అడ్డగోలుగా తెచ్చి వారి జీవితాలను అంధకారంగా మార్చిందని దానిని రద్దు చేసి మత్స్యకారులకు ఎన్డీఏ ప్రభుత్వం అండగా నిలిచిందని అన్నారు.రాష్ట్రంలో మత్సకారులు గత ప్రభుత్వం కేవలం 10 వేల రూపాయలు మాత్రమే ఖాతా లలో జమ చెయ్యగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం 20 వేల రూపాయలు చొప్పున మత్స్యకార సోదరుల ఖాతాలలో జమ చెయ్యడం జరిగిందని అన్నారు.గత ప్రభుత్వం లబ్ధిదారులు ఇతర లబ్దిని పొందుతూన్నారనే వంకతో వారికి మత్స్యకార భరోసా ను అందకుండా వారిని మోసం చేయడం జరిగిందని అన్నారు.ఎన్డీఏ ప్రభుత్వం ప్రతీ మత్స్యకార సోదరులకి లబ్ధిని అందజేసిందని అన్నారు.ప్రతీ ఒక్కరికి మత్స్యకార భరోసాను అందజేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు రాజోలు నియోజకవర్గ శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అడబాల యుగంధర్,మల్లిపూడి సత్తిబాబు,పినిశెట్టి బుజ్జి,చాగంటి స్వామి,ముప్పర్తి నాని,గుబ్బల ఫణికుమార్,మాజీ సర్పంచ్ బర్రె శ్రీనివాస్,కొల్లు రాము,కొల్లు సామోరు,పొన్నాల ప్రభ,వులిశెట్టి అన్నపూర్ణ,మేడిచర్ల సత్య,పిండి సత్యనారాయణ,బొక్కా గోవింద్,సాధానాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## లూరులో శ్రీ శ్రీ కళావేదిక ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు

**రెండు వేలమంది కవులు , కళాకారులు హాజరు**

**మే 10 , 11 తేదీలలో రెండు రోజులపాటు సంబరాలు - కత్తిమండ ప్రతాప్**

**సఖినేటిపల్లి, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక,సామాజిక సేవా సంస్థ శ్రీ శ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఏలూరులో రెండు రోజులపాటు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు శ్రీ శ్రీ కళావేదిక సి.ఈ.ఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. సఖినేటిపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏలూరులోని వేణుగోపాలస్వామి కళ్యాణ మండపం నందు మే 10 మరియు 11 తేదీలలో రెండు రోజులపాటు అత్యంత వైభవంగా ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు జరగనున్నయన్నారు . ప్రపంచ కవితోత్సవం , సాహితీ సదస్సులు, వివిధ రంగస్థల ప్రదర్శనలు , జానపద కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఏక పాత్రాభినయం, మ్యాజిక్ , మిమిక్రీ లతో పాటు ఆర్ట్ గ్యాలరీ , పుస్తకావిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగుకవులు రచయితలు ,కళాకారులు రెండు వేలమంది ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు కార్యక్రమంలో పాల్గొనున్నట్లు కత్తిమండ ప్రతాప్ తెలిపారు . తెలుగు భాష , తెలుగు సాహిత్యం , తెలుగు కళలు , తెలుగు సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా శ్రీ శ్రీ కళావేదిక నిరంతర సాహితీ కార్యక్రమాల్లో భాగంగా ఏలూరులో సాహితీ సంబరాలు నిర్వహించనున్నట్లు ప్రతాప్ తెలిపారు . అదే విధంగా పలువురు భాషావేత్తలు, కవులు , కళాకారులకు పురస్కారాలు అందించి సత్కరించనున్నామన్నారు . ఏ విధమైన ఫీజు లేకుండా పాల్గొన్న కవులు, కళాకారులు అందరిని జ్ఞాపిక, శాలువా , పూలదండ , ప్రశంసా పత్రంతో ఘనంగా సత్కరించనున్నమని పాల్గొన్న వారందరికీ ఉచిత భోజన వసతి సౌకర్యం కలిపించనున్నట్లు ప్రతాప్ తెలిపారు .ఇది సాహితీ చరిత్రలో అతిపెద్ద కార్యక్రమంగా నిలవడంతో పలు ప్రపంచ రికార్డు సంస్థలు ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డుగా నమోదు చేయనున్నట్లు సి.ఈ.ఓ కత్తిమండ ప్రతాప్ తెలిపారు . ప్రోగ్రాం కన్వీనర్ లుగా కొల్లి రమావతి , డాక్టర్ పార్ధసారధి , జి .ఈశ్వరీ భూషణం లు వ్యవహరిస్తున్నారన్నారు .

## క్రికెట్ జట్టు విజేతగా సువర్ణ పేట



**సఖినేటిపల్లి, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి గ్రామంలో అండర్ 19 విభాగంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో సువర్ణ పేట జట్టు విజయం సాధించింది.సఖినేటిపల్లి లూథరన్ చర్చి కు సంబందించిన తొమ్మిది పేటలు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయి.రెండో స్థానంలో జయపేట జట్టు నిలిచింది.జనసేన పార్టీ యువనాయకులు బందెల శరత్ రాయ్ విజేత జట్టుకు ప్రైజ్ మనీ 5 వేల రూపాయలను స్పాన్సర్ చేయడం తో పాటు ఆయనే స్వయంగా అందించారు.ఈ కార్యక్రమంలో తోటే సురేష్,మేడిది శ్రీధర్ జిల్లెళ్ల బిట్టుపాల్గొన్నారు.

## చేయూత ఆధ్వర్యంలో 30 నుండి ప్రత్యేక తరగతులు

**కాకినాడ, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఇటీవల ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ఫెయిల్ అయిన విద్యార్థులకు కోసం చేయూత ఆధ్వర్యంలో 30వ తారీఖు నుండి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు .కాకినాడ టూ టౌన్ సమీపాన ఉన్న రోటరీ చేయూత భవన్లో ఈ ప్రత్యేక తరగతులను 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు ప్రతిరోజు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల విద్యా సంవత్సరం వృధా కాకూడదన్న దృక్పథంతో ఉన్నత విద్యకు వారందరూ ఎంపికవ్వాలన్నా సదాశయంతో ఈ తరగతులను నిర్వహిస్తున్నామని వివరించారు. తమ సంస్థ లో సభ్యులుగా ఉన్న వివిధ పాఠశాలలకు చెందిన నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత ఈ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని డాక్టర్ రవి తెలిపారు . ఈ ఉపాధ్యాయ బృందంలో రవి శంకర్ వాణి ప్రభ ,ఎస్ కె వి భాష, చింత నారాయణ మూర్తి, శ్రీనివాస్, అలీమ్ అహ్మద్ ,కె తేజస్వి తో పాటు మరి కొంతమంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు ఉచితంగా నిర్వహిస్తున్న తరగతులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డాక్టర్ రవి విజ్ఞప్తి చేశారు 86 397 27 476 లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.






## విద్యార్థి దశ నుండే బాధ్యతాయుతంగా ఉండాలి

**మలికిపురం ఎస్ఐ సురేష్ కుమార్**

**మలికిపురం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

విద్యార్ధి దశ ప్రతీ వ్యక్తి జీవితంలోనూ అత్యంత కీలకమైన దశ అనీ,ఆ దశలో బాధ్యతాయుతంగా ప్రవర్తించేవారు మాత్రమే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని మలికిపురం ఎస్సై సురేష్ కుమార్ పేర్కొన్నారు. ఏ ఎస్ డబ్ల్యు ఏ ( ఆల్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్) విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పోలిశెట్టి గణేష్ ఆధ్వర్యంలో ఆయన అధ్యక్షతన రాజోలు నియోజకవర్గం పదవ తరగతి,ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు దీప్తి కళాశాల ఆవరణలో ఘన సన్మానం జరిగినది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా సఖినేటి పల్లి,రాజోలు మండల విద్యాశాఖాధికారులు,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,వివిధ ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రతినిధులు,విద్యార్ధులు,తల్లితండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్న ఈ సమావేశంలో వక్తలందరూ ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్ధులకు భవిష్యత్తు దిశా నిర్దేశం చేసారు.ఈ కార్యక్రంలో విద్యార్థి సంఘ నాయకులు పోలిశెట్టి గణేష్,మలికిపురం ఎస్సై సురేష్ కుమార్,విద్యాశాఖాధికారులు కిషోర్,మద్దాలి వెంకటేశ్వర రావు,రాజోలు విద్యాశాఖాధికారి నల్లి మనోహర్ ప్రధానోపాధ్యాయులు మెహర్,దీప్తి కళాశాల ప్రిన్సిపాల్ సుధ,మలికిపురం డిగ్రీ కళాశాల సీనియర్ అధ్యాపకులు నక్కా రమేష్ బాబు,పీ.సూర్యనారాయణ రాజు (రవి) మొదలగువారు పాల్గొన్నారు.

## వేసవి విజ్ఞాన తరగతులు

**మలికిపురం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




మలికిపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బి నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన తరగతులు ఏర్పాటు చేశారు.గ్రామ సర్పంచ్ గెద్దం రాజ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిరి. యూపీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు అడబాల వీర వెంకట సత్యనారాయణ మూర్తి సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాల అలంకరించరి.వీరి ప్రసంగాలలో విజ్ఞాన తరగతులను ఉపయోగించుకోవాలని అలాగే గ్రంథాలయములోని పుస్తకములను చదివి ఉన్నతులుగా ఎదగాలని కోరుట జరిగినది.ఈ యొక్క కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ రహీం.ఎం సాంబశివరావు, ఎన్ విజయబాబు %శ్రీ%,జె రక్షక కుమార్ సిహెచ్ కళ్యాణి,ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ను వెంటనే నిలుపుదల చేయ్యాలి

**రాజోలు మండల జేఏసీ**

**రాజోలు, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎస్సీ వర్గీకరణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్ ను వెంటనే నిలుపుదల చేయ్యాలని రాజోలు మండల మాలల న్యాయ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా రాజోలు పట్టణంలో బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సామాజిక భవనంలో మండల జేఏసీ అధ్యక్షులు మట్టా సురేష్ కుమార్ అధ్యక్షతన సోమవారం మాలల న్యాయపోరాట సమితి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నున్న అన్నీ రాజకీయ పార్టీలు మాలల పట్ల వ్యతిరేక వైఖరిని అవలంభిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.ఎన్డీయే కూటమి ప్రభుత్వం మాలలకు తీవ్ర అన్యాయం చేసే చర్యలు చేపట్టడంపై జేఏసీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయ పార్టీలకు అతీతంగా ఎస్సీ వర్గీకరణ కు వ్యతిరేకంగా మాలలందరూ ఉద్యమించాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల జేఏసీ ప్రధాన కార్యదర్శి లిఖితపూడి బుజి,ఉపాధ్యక్షులు మందపాటి మధు, వైస్ ఎంపీపీ పొలుమూరి శ్యాంబాబు,విప్పర్తి సాయిబాబు,బత్తుల మురళీకృష్ణ,కొల్లాబత్తుల సతీష్,చిలకపాటి శ్రీధర్,జిల్లెళ్ళ వినోద్ బాబు,బొడ్డపల్లి పుల్లయ్య,చింతా శ్రీనివాస్,రావి విజయ్,మెడబల శేఖర్,పొన్నమాటి భాస్కర్,బుంగ శ్రీను,బొడ్డపల్లి ప్రసాద్,కలిగితి త్రిమూర్తులు,గెడ్డం జోషి,నల్లి నాగబాబు,పెయ్యాల రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## క్రికెట్ జట్టు విజేత సువర్ణ పేట

**సఖినేటిపల్లి ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

సఖినేటిపల్లి గ్రామంలో అండర్ 19 విభాగంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో సువర్ణ పేట జట్టు విజయం సాధించింది. సఖినేటిపల్లి లూథరన్ చర్చి కు సంబందించిన తొమ్మిది పేటలు ఈ టోర్నమెంట్ లో పాల్గొన్నాయి. రెండో స్థానంలో జయపేట జట్టు నిలిచింది. జనసేన పార్టీ యువనాయకులు బందెల శరత్ రాయ్ విజేత జట్టుకు ప్రైజ్ మనీ ? 5000/- లను స్పాన్సర్ చేయడం తో పాటు స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో ల తోటె సురేష్ , మేడిది శ్రీధర్ జిల్లెల్ల బిట్టు పాల్గొన్నారు

## వందేళ్ళ రావి వృక్షం... కొత్త జీవితం

**ఏదో చెప్తుందంట చదవండి మరి**

**కడియం, ఏప్రిల్ 28(గోదావరి విలేకరి)**

**అందరికీ నమస్కారమండి...**

**నేను రావి వృక్షాన్ని... కాదు కాదు మొక్కనండి**


**ఏంటమ్మా... నీవు ఏమిటో నీకే క్లారిటీ లేదు.**

**చెట్టంటావు..మొక్కంటావు**

అయ్యో... అలా కసురుకోకండి. నేనేంటో నాకే ఇంకా అర్థం కావడం లేదండి. వాస్తవానికి వారం రోజుల క్రితం వరకూ నేను వంద సంవత్సరాల మహా వృక్షాన్ని.కాని ఇప్పుడు ఉన్నఫలంగా మొక్కను అయిపోయాను ఇంకొంచెం అర్థమయ్యేలా చెప్తాను ఉండండి...తూర్పుగోదావరి జిల్లా కడియం లో ఓ పంట పొలం వద్ద నేను జీవం పోసుకున్నాను. మహా వృక్షంగా మారాను.పెద్ద పెద్ద కొమ్మలతో ఆ ప్రాంతానంతా ఆవరించాను. కావలసినంత నీడని ఇచ్చాను. ఆక్సిజన్ ఇచ్చాను.అందాన్నీ ఇచ్చాను. కాని ఆ రైతుకు మాత్రం నష్టాన్ని ఇచ్చాను. ఎందుకంటే నా చుట్టుపక్కల సాగు చేయడానికి అవకాశం ఉండడం లేదు. దీంతో రైతుకు కూడా నన్ను తొలగించాలని ఆలోచన వచ్చింది.అంతే నా జీవితం అయిపోయిందనుకున్నాను.ఇన్నాళ్లు ఎంతో దర్జాగా బతికిన నేను ఇక కనుమరుగైపోతానని భావించాను. భావించడం ఏంటి ఎవరైనా



తొలగించాలనుకుంటే అదే కదా జరుగుతుంది. ఎందుకంటే ఇప్పుడు వరకు వేరే మార్గం లేదు.ఈ సృష్టిలో ఇలా చాలా చెట్లు కనుమరుగైపోయిన విషయం మీకు తెలియనిది కాదు. అయితే ఈమధ్య కడియం నర్సరీ రైతులు నాలాంటి ఎన్నో చెట్లకు తిరిగి పునర్జన్మను ఇస్తున్నారని నా యజమానికి తెలిసింది. అంతే లాయర్ చదివిన కొత్తపల్లి మూర్తి (బుర్రిలంక ఉమా పార్వతి నర్సరీ రైతు) కోటేసుకొని కోర్టుకి వెళ్లకుండా ఇలా నాలా తొలగింపుకు గురవుతున్న చెట్లను తిరిగి మొక్కగా మార్చే పనిలో ఉన్నారని ఆయనకు నా భాధ్యతలు అప్పగించారు. అసలు ఇది ఎలా సాధ్యమవుతుంది అనుకున్నాను. కొంచెం కూడా నమ్మకం కలగలేదు. అయితే ఈ మూర్తి అనే కుర్రాడు జనాలను ఏసుకొచ్చి నా కొమ్మలను రంపాలతో తొలగించడం మొదలుపెట్టారు. అయినా నాకేమీ పెద్ద బాధ కలగలేదు. ఎందుకంటే నన్ను మళ్లీ మొక్కగా మారుస్తారనే వింతను చూడాలనుకుంటున్నాను కాబట్టి.మిలటరీ పోలీసు కటింగ్ వేసుకున్నట్లుగా నాకు డిప్ప కటింగ్ చేశారు. ఇక నేను మోడుగా మిగిలాను. ఆ తర్వాత మరి కొంత మంది వచ్చి వేళ్ళను తవ్వారు. అప్పుడు అసలైన ఆపరేషన్ మొదలుపెట్టారు. 35 టన్నుల బరువు ఉండే నన్ను తొలగించడానికి 60 టన్నుల సామర్థ్యం గల హైడ్రాలిక్ మిషన్ తీసుకొచ్చారు. ఆ మిషన్ నన్ను సునాయాసంగా భూమి నుండి వేరు చేసి అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న పెద్ద ట్రాలీ మీద నాకు దెబ్బలేమి తగలకుండా పడుకోపెట్టేసారు. ఆ ట్రాలీ ద్వారా ఈ ఉమాభారతి నర్సరీకి నన్ను చేర్చారు. ఆ నర్సరీ వద్ద నా మొదల నుంచి మళ్లీ వేర్లు రావడానికి అవసరమైన రసాయనాలు పూశారు. అలాగే వేళ్ళు అధికంగా రావడానికి ప్రత్యేకంగా తయారు చేసిన ఓ పెద్ద కుండీలో కూర్చోబెట్టారు.మహ వృక్షం హెూదా పోయి అప్పట్నుంచి నేను మళ్ళీ మొక్కను అయ్యాను. నేనే కాదు అక్కడ నాలాంటి చెట్లు లాంటి మొక్కలు ఎన్నో ఉన్నాయి. ఈ మూర్తి అనే రైతు ఇప్పుడు ఇలాంటి మొక్కలను సేకరించే పనిలోనే ఉన్నారంట. నా రావి జాతితో పాటు మర్రి,ఉసిరి, వేప,గానుగ, బాదం,సీమచింత, కొబ్బరి, తాడి వంటి ఎన్నో మొక్కలు అప్పటికే అక్కడకి వచ్చి ఉన్నాయి. అందరిలో నేనే పెద్దదాన్ని అంట. అందుకనే నన్ను ఆ నర్సరీ ఆఫీస్ ముందు కూర్చోబెట్టారు. పెద్దరికం బాధ్యత అప్పగించారు. ఏదో పొలాల మధ్యన అంతగా జన సంచారం లేని ప్రాంతంలో ఉండేదాన్ని. నాకు అంతగా మనుషులతో సంబంధాలు ఉండేవి కాదు. కాని ఇక్కడకు వచ్చాకా అంతా వింత వాతావరణం కనిపిస్తుంది. కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డు మీద రైయ్.. మని కార్లు, మోటార్ సైకిల్ పై వెళ్ళి వాళ్లు ఆగి నన్ను చూస్తున్నారు. కొందరు నా పక్కన నిలబడి



ఫోటోలు తీయించుకుంటున్నారు. అలాగే పేపరు వాళ్ళు,టీవీ వాళ్లు పెద్ద పెద్ద కెమెరాలు వేసుకొని వచ్చి నన్నే వీడియోలు తీస్తున్నారు.నేను టీవీలో కనపడతానని వాళ్లు వీళ్లు చెప్తుంటే తెగ మురిసిపోతున్నాను. కొందరు కుర్రాళ్లే నా ముందు నిలబడి వంకర్లు తిరుగుతూ సెల్ఫీ ఫోటోలు తీయించుకుంటున్నారు. ఆయన ఎవరో కడియపులంక సత్తిబాబు అంట నన్ను నాతో పాటు మిగిలిన మొక్కలను(ఒకప్పుడు వృక్షాలు) వీడియోలు తీసి దేంట్లోనో(పేస్ బుక్,ఇంస్టాగ్రామ్,యూట్యూబ్ లలో) పెడితే ఎన్నో లక్షల మంది చూశారని ఇక్కడ కుర్రాళ్లు చెప్పుకుంటుంటే నేను విన్నాను.చచ్చి బతికిన నాకు ఇదంతా అర్థం కావడం లేదు. ఎవరెవరో యువకులు కార్లు,మోటారు సైకిళ్ళపై ఈ నర్సరీ ఆపీసుకి అర్ధరాత్రి వరకూ వస్తున్నారు వెళ్తున్నారు. వాళ్ళు ఎవరో నాకు తెలియదనుకోండి.కాకపోతే ఎక్కడలేని సందడి నా దగ్గరే కనిపిస్తుంది. అయితే నాకు ఇప్పుడు ఇస్తున్న ఈ భోగం చూసి విర్రవీగిపోవడానికి వీలు లేదండి. ఎందుకంటే ఇంత డబ్బు ఖర్చు పెట్టి నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు. నేను మళ్ళీ జీవం పోసుకుని చిగురించి కొమ్మలు ఇస్తేనే రైతు కళ్లల్లో ఆనందం..నా జీవితానికి పరమార్థం. నేను పూర్తిస్థాయిలో బతికి కొమ్ములు ఇస్తే ఇక నాకున్నంత డిమాండ్ ఎవరికి ఉండదంట. పెద్ద పెద్ద కంపెనీ వాళు ళ్ళ నన్ను బోలెడంత డబ్బు పెట్టి కొనుగోలు చేసి తీసుకెళ్తారని నాతో పాటు ఉన్న మొక్కలు చెబుతుంటే తెలిసింది. అందుకనే నేను ఎలాగైనా బతుకుతాను. రైతు నమ్మకాన్ని ఒమ్ము చేయను.నాలాంటి వాళ్లు బతికితేనే ఈ భూమ్మీద ఉన్న ఏ పురాతన చెట్లు కనుమరుగు కావు. ఖచ్చితంగా పునర్జన్మ వస్తుంది. మళ్ళీ పూర్తి స్థాయిలో బతికి మీ ముందుకు వస్తానండి.కష్టపడి నా కొత్త జీవితం గురించి తెలుసుకున్నందుకు ధన్యవాదాలండి.ఉంటానండి.

**ఇట్లు**

**వారం క్రితం వరకూ వందేళ్ల చెట్టుగా ఉన్న రావి మొక్కను**

**కొండ్రెడ్డి లక్ష్మీ శ్రీనివాస్**
**సీనియర్ జర్నలిస్టు**



# వీరవల్లి శంకరరావుకు మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని ఉచిత పంపిణీ చేసిన జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి

ఏలూరు ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో శారీరక విభిన్న ప్రతిభావంతులయిన జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు వీరవల్లి శంకర రావు రూ 65 వేలు విలువచేసే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని జిల్లా కలెక్టరు ఉచిత పంపిణీ చేశారు.మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయవలసినదిగా కోరుచూ పిజిఆర్ యస్ కార్యక్రమము నందు గతంలో అర్జీ సమర్పించుట జరిగింది. దీంతో జిల్లా కలెక్టరు స్పందించి మూడు చక్రాలు వాహనాన్ని మంజూరు చేసి ఈ రోజు పంపిణీ చేయుట జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మూడు చక్రాల బ్యాటరీ వాహనం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రి సెల్వి సూచించారు.మూడు చక్రాల బ్యాటరీ వాహనం ఉచిత అందజేసినందులకు వీరవల్లి శంకరరావు జిల్లా కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమగోదావరి జిల్లా ఐ ఆర్ సి ఎస్ గోల్డ్ మెడల్ కు ఎంపిక



భీమవరం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ అందించిన మెరుగైన సేవలకు గుర్తింపుగా 2024-25 సంవత్సరానికి రాష్ట్ర స్థాయిలో గోల్డ్ మెడల్ కు ఎంపిక. పశ్చిమగోదావరి జిల్లా 2022-23 నుండి 2024-25 వరకు వరుసగా మూడు సంవత్సరాలపాటు ఐ ఆర్ సి ఎస్ గోల్డ్ మెడల్ కు ఎంపిక మే 8న వరల్డ్ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్ భవన్ లో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ మరియు ఐ ఆర్ సి ఎస్ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ మరియు ఐ ఆర్ సి ఎస్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి గోల్డ్ మెడల్ ను అందుకోనున్నారు. భీమవరం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నందు తల సేమియా పిల్లలకు మే 8న తల సేమియా సెంటర్ ఏర్పాటుకు ప్రకటన. భీమవరం రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నందు త్వరలో తలసేమియా పిల్లలకు సెంటర్ ఏర్పాటు చేసి చికిత్సను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు ఐ ఆర్ సి ఎస్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి తెలిపారు.

సోమవారం పిజిఆర్ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ మరియు ఐ ఆర్ సి ఎస్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ సేవలకు గోల్డ్ మెడల్ ను సాధించడం అభినందనీయమని, దీనికి కృషి చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ, జిల్లా, డివిజన్ మండల స్థాయి అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది అభినందనీయులన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మే 8న రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా విజయవాడ రాజ్ భవన్ లో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ ప్రెసిడెంట్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ మరియు ఐ ఆర్ సి ఎస్ జిల్లా శాఖ ప్రెసిడెంట్ చదలవాడ నాగరాణి అవార్డును అందుకోనున్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాల్లో రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందుతున్న సేవలను గుర్తించి గోల్డ్ మెడల్ కు ఎంపిక చేయడం జరుగుతుంది. దీనిలో పశ్చిమగోదావరి జిల్లా 2022-23 నుండి 2024-25 వరకు వరుసగా మూడు సంవత్సరాలపాటు గోల్డ్ మెడల్ ను సాధించడం జరిగిందన్నారు. రాష్ట్ర గవర్నర్ మే 28న భీమవరం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ నందు తలసేమియా పిల్లలకు తల సేమియా సెంటర్ ఏర్పాటుకు ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఐ ఆర్ సి ఎస్ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ ఎం ఎస్ వి ఎస్ బద్రి రాజు జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంలో కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా జి ఎస్ డబ్ల్యు ఎస్ అధికారి వై.దోసి రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కెసిహెచ్ అప్పారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.

# గుంటూరులో కదంతొక్కిన కోకో రైతులు

## -ఉద్యాన కమిషనర్ కార్యాలయం ముట్టడి




గుంటూరు, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరు ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం ముందు కోకో రైతులు కదం తొక్కారు. కోకో గింజలు, కోకో కాయలతో సోమవారం కోకో రైతుల చలో గుంటూరు "ధర్నా" నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి హామీ ప్రకారం ధరల ఒప్పంద ప్రకటన చేయకపోవడంతో ఆగ్రహించిన కోకో రైతులు ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. మాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యలు శరణ్యం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు.

ముందుగా చుట్టుగుంట సర్కిల్ వద్ద జరిగిన సభకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్ గోపాలకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, బోళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పుగంటి భాస్కరరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గుది బండి వీరారెడ్డి, ఉప్పల కాశీ, కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ మాట్లాడారు. కోకో గింజలు కొనుగోలు కంపెనీలు రోజు రోజుకీ ధర తగ్గించి వేయడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల మోసాలతో నష్టపోతూ తీవ్ర ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని చెప్పారు. ఈనెల 3న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో కోకో రైతుల సంఘం ప్రతినిధులు,కోకో రైతులు, ఉద్యాన శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు, కోకో గింజలు కొనుగోలు కంపెనీలతో రాష్ట్ర సచివాలయంలో సమావేశం జరిపారని గుర్తు చేశారు. కోకో రైతులకు న్యాయం జరుగుతుందని, వ్యవసాయ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఈనెల 7న కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయ ప్రకటన వస్తుందని ఎదురు చూసామని,21 రోజులు గడిచినా ఇంతవరకు కోకో గింజల కొనుగోలు ధరల ఒప్పంద ప్రకటన చేయకపోవడంతో అన్యాయమని విమర్శించారు. కంపెనీల మోసాలు రోజు రోజుకి పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.మోండలీజ్ కంపెనీ ప్రతినిధులు సీజన్, అన్ సీజన్ గింజలను 3:1 నిష్పత్తిలో కిలో కోకో గింజలకు రూ.550/- కొనుగోలు చేస్తామని మంత్రి సమక్షంలో చెప్పి అమలు చేయలేదన్నారు. ప్రస్తుతం మోండలీజ్ కంపెనీ కిలో గింజలకు రూ. 50/- తగ్గించారని, మిగిలిన కంపెనీలు కూడా ధర తగ్గించి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు దగ్గర నుండి గింజలు కొనుగోలు చేయడం లేదని,కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్ లో కిలో కోకో గింజలకు రూ.750/- లకు పైగా ధర ఉందిని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించకపోతే కోకో రైతులు మరింతగా నష్టపోతారని అన్నారు. కోకో గింజలు కొనుగోలు కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని,మార్కెట్ మాయాజాలంతో మోసం చేస్తున్నాయని, కంపెనీల మోసాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించి, రైతులు వద్దనున్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టి కోకో రైతులకు న్యాయం చేయాలని కోరారు. విదేశీ కోకో గింజల దిగుమతులు వెంటనే నిలుపుదల చేయాలని దేశీయంగా కోకో రైతులను ఆదుకునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కోకో రైతుల పోరాటం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు.



**డిమాండ్స్:**

1) అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర కల్పించాలి.
2) రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి గారు ఇచ్చిన హామీ ప్రకారం కోకో గింజల ధరల ఒప్పంద నిర్ణయ ప్రకటన చేయాలి.
3) రైతులు వద్దనున్న కోకో గింజలు కొనుగోలు చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలి.
4) కోకో గింజల కొనుగోలు కంపెనీలు ఒక్కో కంపెనీ ఒక్కో విధంగా ధర ఇస్తూ మార్కెట్ మాయాజాలంతో రైతులను మోసగిస్తూ నష్టపరచడాన్ని అరికట్టాలి.

అనంతరం ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉద్యాన శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ హరినాథ్ రెడ్డి కోకో రైతుల సంఘం ప్రతినిధులు, కోకో రైతులతో చర్చలు జరిపారు. వారం పది రోజుల్లో మరలా కంపెనీలతో సమావేశం నిర్వహించి ధరలు తగ్గకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కోకో రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు హరినాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర నాయకులు కోనేరు సతీష్ బాబు, పి.సుధాకర్, పి. నరసింహారావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కంచుమాటి అజయ్ కుమార్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు తదితరులు మాట్లాడారు. చలో గుంటూరు కార్యక్రమానికి ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో కోకో రైతులు తరలివచ్చారు.



# జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ప్రారంభం

ఏలూరు ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణాతరగతులను సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమము సోమవారం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలే మొదటినేస్తమని అన్నారు. తరచు గ్రంథాలయము నకు రావడం ఒక అలవాటు చేసుకోవాలన్నారు. మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది, కష్ట%శీ%గా చదవద్దు- ఇష్టంగా చదవండి అంటు ఆయన హితవు పలికారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ఆయన స్నాక్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమములో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి.సందీప్ కుమార్, డి.శ్రీవల్లి సీనియర్ రీసోర్స్పర్సన్ పి.శంకర్ డ్రాయింగ్ టీచర్,జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంధి,పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



చింతలపూడి, ఏప్రిల్ 28 (తెలుగు రాష్ట్రం విలేకరి):

దేశంలో కార్మిక సమస్యలపై, హక్కులపై కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు, పెట్టుబడిదారులు దాడి అధికమైన సందర్భంలో 2025 మేడే ఒక ప్రత్యేకత సంతరించుకుం దని సిఐటియు చింతలపూడి మండల అధ్యక్షులు నత్త వెంకటేశ్వరరావు అన్నారు. పోరాడి సాధించుకున్నటువంటి సమ్మెహక్కు, ఎనిమిది గంటల పని దినాలు నిర్వీర్యం చేస్తానికి కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి కనీస వేతనాలు, కార్మికుల సమ్మె హక్కు లేకుండా పార్లమెంట్లో బిల్లును అంగీకరింప చేసుకోవడానికి ఎన్డీఏ ప్రభుత్వం తీవ్ర కృషి చేస్తుందని దీనివలన రాబోయే కాలంలో కార్మికులు జీతభత్యాలు, కార్మిక హక్కులకు భంగం కలిగినప్పుడు సమ్మె చేసే హక్కు కోల్పోతారని, ఇప్పటికే పెట్టుబడిదారులు ఇన్ఫోసిస్ , ఎల్ అండ్ టి మేనేజ్మెంట్లు కార్మికులు రోజుకి కనీసం 12 గంటలు పని చేయాలని, ఆదివారం సెలవు దినాలలో కుటుంబ సభ్యులతో గడపటం మానివేసి కర్మాగారాలకు వచ్చి పని చేయాలని ప్రకటనలు ఇవ్వటం రాబోయే కాలంలో కార్మికుల శ్రమను ఏ విధంగా వీరు దోచుకుంటారో మీరు మాటలలో విసదీకరించటం జరుగుతుందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ వి ఎస్. నారాయణ అన్నారు. మేడే జయప్రదం చేస్తానికి మేడే పోస్టర్ ను అంగన్వాడి చింతలపూడి ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎన్.సరోజిని, ప్రగడవరం సెక్టార్ నాయకురాలు కె. కవిత, వెంకమ్మ, ఎమ్. సత్యవతి ఆధ్వర్యంలో మేడే గోడ పత్రికను అవిష్కరించారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులకు కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలి

## -ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్

చింతూరు, ఏప్రిల్ 28 (తెలుగు రాష్ట్రం విలేకరి):



ఆదివాసి మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తుష్టి జోగారావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో, ఇతర శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ సంవత్సరం ఏప్రిల్ నుండి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం వారు ఇంత వరకు ఆ ఉత్తర్వులు ఇవ్వలేదని అన్నారు. దీనివలన కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఈ నెల జీతాలు ట్రెజరీ నుండి వచ్చే పరిస్థితి ఉండదని పేర్కొన్నారు. కొనసాగింపు ఉత్తర్వులు లేకపోతే ట్రెజరీ వారు జీతాలు ఆపివేస్తే ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇప్పటికే చాలా మంది ఉద్యోగులకు మార్చి -2025 జీతాలు రాలేదు ఇప్పుడు ఏప్రిల్ నెల జీతం కూడా ఆగితే అనేక రకాల సమస్యలను ఎదుర్కొంటూ ఉద్యోగం చేయాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి కాంట్రాక్ట్ ఉద్యోగుల కొనసాగింపు కోసం కొన్ని యూనియన్ల వారు వినతి పత్రాలు ఇచ్చి ఉన్నారు. కాబట్టి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారు మరియు ఉన్నత అధికారులు స్పందించి త్వరగా కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చి ఉద్యోగుల జీతాలు ఆగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నామని అన్నారు.

# టీడీపీ కార్యకర్త కుమార్తె వేడుకలో పాల్గొన్న నాయకులు



చింతూరు, ఏప్రిల్ 28 (తెలుగు రాష్ట్రం విలేకరి) :

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజకవర్గం చింతూరు మండలం బొడ్డుగూడెం గ్రామంలో సోమవారం నాడు తెలుగు దేశం పార్టీ కార్యకర్త ఊకె బుచ్చయ్య కుమార్తె ఓనిల అలంకరణ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకలో చింతూరు టీడీపీ పార్టీ మండల నాయకులు తుర్రం తమ్మయ్య, రవ్వ, జోగయ్య పాల్గొని ఆశీర్వదించారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

## నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం



నర్సీపట్నం, ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

నర్సీపట్నం శాఖా గ్రంధాలయంలో గ్రంధాలయాధికారి పీ.దమయంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరంను మండల విద్యాశాఖాధికారి సీహెచ్.తలుపులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పిల్లలతో కాసేపు ముచ్చటించారు.

అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ ఒకరు మరో ఇద్దరిని ఈ శిబిరంకు తీసుకురావాలన్నారు. పుస్తకాలు చదివి కొత్త విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. ఆటపాటలతో పాటు గ్రంధాలయ పఠనం ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జీ.శ్రీనివాస్(ఎస్ఎ ఇంగ్లీష్), జీ.సుబ్బారావు(ఎస్ఎ మ్యాథ్స్) పిల్లలకు సమ్మర్ క్యాంపు ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

## నాలుగు చేతి బోర్లు మంజూరు



చోడవరం ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

చోడవరం పట్టణ పరిధి కోటవీధి, గండి కాలనీ, శివాలయం వీధి లో లో 4 చేతి బోర్లు నీ మంజూరు చెయ్యడం జరిగింది. వాటికి కొబ్బరి కాయ కొట్టి మొదలు చేసి అతి త్వరలో పూర్తీ చేసి ప్రజలకు త్రాగు నీటి సమస్య ను పరిష్కారించే లా చేయాలని అధికారులకు ఆదేశం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు,గునురూ మల్లునాయుడు,గునురూ పెదబాబు, సకురు కోటేశ్వరరావు,దేవరపల్లి వెంకట అప్పారావు, మత్య రాజు గండి మూర్తి, ఎంపిటిసి చిన్న, నాయుడు , పప్పు శ్రీను, యమ్డిఒ ఆంజనేయులు,ఈ ఓ నారాయణరావు,సర్పంచి నూకలమ్మ,ఎంపిపి గాడి కాసులమ్మ, వార్డు మెంబర్ సంతోష్ ,వార్డు మెంబర్ శేషు %ు% దివ్య ,శివాలయం ఛైర్మన్ గునూరు సురేష్,గర్ల్స్ హై స్కూల్ ఛైర్మన్ గుమ్మల సత్తిబాబు ఎస్సీ సెల్ అధ్యక్షులు మల్లిబాబు , పార్ధు రాజు, బొబ్బిలి ఈశ్వరరావు గండి నాయుడు .వీరితో పాటు చోడవరం పెద్దలు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు,

## పదో తరగతి అత్యధిక మార్కులు సాధించిన వారికి సన్మానం



చోడవరం ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**చోడవరం మండలం లో గల 14 ప్రభుత్వ/జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలలో ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాలు లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన 16 మంది విద్యార్థి, విద్యార్థులను ఈ రోజు మండల విద్యాశాఖాదికారి వారి కార్యాలయం లో మండల విద్యాశాఖాది కారులు బి. పడాలదాస్, కె.సింహాచలం మరియు మండల విద్యాశాధికారి కార్యాలయ సిబ్బంది అభినందన సభ ఏర్పాటు చేసి విధ్యార్థులను వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు.**

ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ ఈ సంవత్సరం సాధించిన ఫలితాలు పై సంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థులు పట్టుదతో ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించారని,పిల్లల విజయాలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు.ఈ విజయాన్ని సాధించిన ప్రతి విద్యార్థి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని, నిరంతరం చదువులో నూతన నైపుణ్యాలను అభ్యసిస్తూ ,వ్యక్తిత్వ వికాసాన్ని సాధిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు.సాదారణ విద్యార్థులు చే సాధించిన అసాధారణ ఫలితాలు గా పేర్కొంటూ, ఈ విద్యార్థులను ముందుండి ఇంత మంచి మార్కులు సాధించడానికి కారణం అయిన ఉపాధ్యాయుల కృషి ని అభినందించుట జరిగింది.ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, రవిశంకర్, శిరీషా, నాగలక్ష్మి,కె.వి.యమ్.నాయుడు,సరోజిని, భూలక్ష్మి, చంద్రిక, సత్యనారాయణ మరియు రమేష్ పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల లొకేషన్ నాలుగుసార్లు గుర్తించిన సైన్యం: కొనసాగుతున్న వేట..!



**పహల్గాం : పహల్గాం ఉగ్రవాదుల కోసం భద్రతా దళాల వేట తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఇప్పటికే ఆ నలుగురి లొకేషన్లను నాలుగుసార్లు ట్రాక్ చేయగా.. వారు త్రుటిలో తప్పించుకొన్నారు. ఒకసారి భద్రతా దళాలు.. ఉగ్రవాదులకు మధ్య కాల్పులు కూడా చోటుచేసుకొన్నాయి.**

దక్షిణ కశ్మీర్లోని అడవుల్లో దళాలు పలు సందర్భాల్లో వారికి అత్యంత దగ్గరగా వచ్చాయని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ ఎప్పటికప్పుడు వారి లొకేషన్లను గుర్తిస్తున్నారు. "ఎలుకా పిల్లి ఆటలా సాగుతోంది.. వారు మా కనుచూపు మేరలోకి వచ్చినా.. కాల్పులు జరిపి తప్పించుకొంటున్నారు. ఇక్కడ అడవులు అత్యంత చిక్కగా ఉన్నాయి. మనకు కనిపిస్తున్నా.. ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. వారిని పట్టుకొని తీరతాం. కొన్ని రోజులు మాత్రమే మిగిలిఉంది" అని ఓ సైనిక అధికారి పత్రికల వద్ద వ్యాఖ్యానించారు.

### వారి లొకేషన్లు ఇలా..


ఉగ్రవాదులను తొలుత అనంతనాగ్‌లోని పహల్గాం తెహస్లీ వద్ద గుర్తించారు. కానీ, దళాలు అక్కడికి చేరేలోపు వారు చిక్కటి అడవుల్లోకి పారిపోయారు. ఆ తర్వాత కుల్గాం అడవుల్లో వారి కదలికలు కనిపించాయి. అక్కడికి చేరుకొన్న భద్రతా దళాలపై కాల్పులు జరిపి పారిపోయారు. అనంతరం తిరిగి త్రాల్ కొండల్లో వారు ఉన్నట్లు దళాలు గుర్తించాయి. అక్కడి నుంచి వారు జారుకొన్నాక కొకెర్నాగ్‌లో లొకేషన్ బయటపడింది. వారు ప్రస్తుతం ఈ ప్రాంతం చుట్టుపక్కలే ఉండొచ్చని చెబుతున్నారు. ఒక గ్రామంలోని ఇంట్లో వారు రాత్రి భోజనానికి వెళ్లగా అక్కడికి దళాలు చేరుకోవడంతో.. ఆహారం తీసుకొని వారు పారిపోయినట్లు సైనికాధికారి వెల్లడించారు.

ప్రస్తుతం ఉగ్రవాదులు తమకు అవసరమైన నిత్యావసరాల సేకరణలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. సాధారణంగా వీరు గ్రామాల సమీపంలోకి వెళ్లినప్పుడు అక్కడ ఉండే స్థానిక సహాయకులను సంప్రదించి అడవుల్లోకి ఆహారం తెప్పించుకొంటారు. ఆ సమయంలో దళాలకు హ్యూమన్ ఇంటెలిజెన్స్ లభిస్తుంది. కానీ వీరు చాలా అప్రమత్తంగా ఉన్నారని అధికారులు చెబుతున్నారు.

ఉగ్రవాదులు కిష్ట్‌వార్ ప్రాంతంలోకి ప్రవేశిస్తే.. భద్రతా దళాలకు సమస్యలు రావొచ్చని భావిస్తున్నారు. ఇక్కడి పర్వతాలు పహల్గాం వైపు శిఖరాలతో కలిసి ఉంటాయి. తక్కువ మంచు ఉండటంతో.. ఉగ్రవాదులు అక్కడి నుంచి వారు చిక్కటి అడవులు ఉన్న జమ్మూ ప్రాంతంలోకి ప్రవేశించడానికి అవకాశం లభిస్తుంది.

ప్రస్తుతం ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూకశ్మీర్ పోలీసులు పహల్గాం చుట్టుపక్కల అడవులను జల్లెడ పడుతున్నారు. ఉగ్రవాదులు బైసరన్ లోయలో కొందరు సందర్శకుల నుంచి మొబైల్ ఫోన్లు లాక్కొన్నారు. తమ వారితో మాట్లాడేందుకు వాటిని వాడొచ్చన్న అనుమానాలు ఉండటంతో టెక్నికల్ ఇంటెలిజెన్స్ బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉన్నాయి.

## ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ





**దిల్లీ: పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు న్యూదిల్లీ సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది.**

పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహన్‌తో రాజ్‌నాథ్ ఆదివారం భేటీ అయ్యారు. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు.

### పాక్‌కు తుర్కియే సైనిక విమానాలు..

ఇదిలాఉండగా.. పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా తుర్కియేకు చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్‌లో ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

### మధ్యాహ్నం మరో కీలక భేటీ..

మరోవైపు, రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పార్లమెంట్ హౌస్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.

## రెల్లలపాలెం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

విశాఖపట్నం ఏప్రిల్ 28 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



**చీడికాడ మండలంలో కోనాం పంచాయితీలో రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని పవన్ కళ్యాణ్ మామయ్య మా గ్రామానికి రోడ్డు వెయాలి చంద్రబాబు తాతయ్య మా గ్రామానికి రోడ్డు వేయాలని అంటూ చిన్నారులు ఇద్దరు ఫోటోలు తో చిన్నారులు గిరిజనులు సోమవారం రెల్లలపాలెం గ్రామం వినూత్న రీతిలో నిరసన తెలిపారు.**

గిరిజన చిన్నారులకు గ్రామ ప్రజలకు మద్దతుగా ఆదివాసి గిరిజన సంఘం ఐదోవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట. నరసింహమూర్తి మాట్లాడుతూ చీడికాడ మండలంలో కోనాం పంచాయతీలో గిరిజన గ్రామ మైన రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టాలని గిరిజన చిన్నారులు గ్రామ ప్రజలు కోరుతు న్నారని తెలిపారు.

మౌలిక సదుపాయాలు అందు బాటులో లేక బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారుని 20-01-2025న ఆ పల్లి అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసామతెలిపారు.ఆరోగ్యాలు బాగోలేకపోతే డోలి కట్టుకొని పది కిలోమీటర్లు డోలిమోతతో కాళినడకన వెళ్ళవలసి వస్తుందని వైద్యానికి దూరం అయ్యారు నిత్యవసర వస్తువులు తీసుకురావడానికి దేవరపల్లి 25 కిలోమీటర్లు కోణం 10 కిలోమీటర్లు సంతలకు వెళ్లి భుజాలపై తలపై నిత్యవసర వస్తువులు మూసుకొని రావాల్సి వస్తుంది అని అన్నారు పవన్ కళ్యాణ్ చంద్రబాబు జిల్లా కలెక్టర్ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణమే రెల్లలపాలెం గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించాలని నరసింహమూర్తి కోరారు చేశారు ఈ కార్యక్రమంలో ఇరట.ఈశ్వరమ్మ, కోట. గంగమ్మ, దాయిరి. దేముడమ్మ, కోట. మల్లమ్మ. సోమల, సూర్యనారయణ, చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

SPORTS NEWS


https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 29,
మంగళవారం 2025



# పార్ట్‌నర్‌షిప్ ఎంత ముఖ్యమో..

### కోహ్లీ కీలక వ్యాఖ్యలు



**గుజరాత్ : ఈ ఐపీఎల్ సీజన్‌లో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. బెంగళూరు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. ఆదివారం ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లోనూ నిలకడగా ఆడాడు. ఆర్సీబీ ఛేదనలో ఇబ్బందిపడుతున్న సమయంలో మరో ఆటగాడు కృనాల్‌తో కలిసి బలమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో బెంగళూరుకు మరో విజయం సొంతమైంది. మ్యాచ్ అనంతరం దీని గురించి కోహ్లీ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. పార్ట్‌నర్‌షిప్ ఎంత ముఖ్యమనే విషయాన్ని ఈ మధ్య ఆటగాళ్లు మర్చిపోతున్నారని అన్నాడు.**

"పిచ్ పరంగా చూస్తే ఇది మాకు అత్యుత్తమమైన విజయం. గతంలో ఇక్కడ కొన్ని మ్యాచ్‌లు ఆడాం. అప్పటితో పోలిస్తే ఈసారి వికెట్ భిన్నంగా ఉంది. ఇక, ఛేదనలో ఉన్నప్పుడు నేను ఎప్పుడూ డగౌట్‌నే చూస్తూ ఉంటా. మేం సరైన మార్గంలో ఉన్నామా? లేదా? అని పరిశీలించుకుంటా. మ్యాచ్‌ను నిలకడగా ముందుకుతీసుకెళ్లేందుకు సింగిల్స్, డబుల్స్‌ను కూడా వదిలిపెట్టను. ఈ మధ్య ఆటగాళ్లు భాగస్వామ్యం ప్రాముఖ్యతను మర్చిపోతున్నారు. బలమైన పార్ట్‌నర్‌షిప్ ఉన్నప్పుడే.. బౌలర్లపై ఆధిపత్యం చెలాయించగలమనే విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని కోహ్లీ చెప్పాడు.

ఇక ఢిల్లీతో మ్యాచ్‌లో అర్ధశతకంతో ఆకట్టుకున్న కృనాల్ పాండ్యను విరాట్ మెచ్చుకున్నాడు. "కృనాల్ అద్భుతంగా ఆడాడు. సమయం కలిసొస్తే అతడు తన సత్తా చాటగలడు. ఈ మ్యాచ్‌లో మేం పరస్పరం మంచి అవగాహనతో ఆడాం. నన్ను నెమ్మదిగా ఆడమని, తాను ఛాన్స్ తీసుకుంటానని కృనాల్ చెప్పాడు" అని కోహ్లీ తెలిపాడు.

#### కోహ్లీ ఉంటే ఈజీనే: కృనాల్

అటు కృనాల్ పాండ్య కూడా దీనిగురించి స్పందించాడు. "మ్యాచ్ పరిస్థితిని బట్టి నా పాత్ర ఏంటో అర్థమైంది. మూడు వికెట్లు త్వరగా పడిపోవడంతో.. భాగస్వామ్యాన్ని నెలకొల్పాల్సిన అవసరాన్ని గుర్తించా. అయితే, మరో ఎండ్‌లో విరాట్ ఉన్నప్పుడు నా పని మరింత సులువవుతుంది. తొలి 20 బంతులు నన్ను పరీక్షించాయి. కానీ, కోహ్లీ ప్రోత్సహిస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత లయ అందుకోగలిగా" అని తెలిపాడు. ఈ మ్యాచ్‌లో కృనాల్ అజేయ 73 పరుగులతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలవగా.. కోహ్లీ కూడా(51) అర్ధశతకంతో రాణించాడు.

#### మరో 10-15 పరుగులు చేసుంటే..

ఓటమిపై ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ మాట్లాడాడు. "తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ కాస్త కష్టంగా అనిపించింది. ఆ తర్వాత డ్యూ రావడంతో రెండో ఇన్నింగ్స్ తేలికైంది. అయితే, మేం మరో 10-15 పరుగులు సాధించాల్సింది" అని అక్షర్ తెలిపాడు.

# కేఎల్ రాహుల్ వికెట్ నా ఫేవరెట్: ప్రసిద్ధ్ కృష్ణ



**గుజరాత్ : గుజరాత్ టైటాన్స్ విజయాల వెనక పేసర్ ప్రసిద్ధ్ కృష్ణదీ కీలక పాత్రే ఉంది. బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్, జాస్ బట్లర్ అదరగొట్టేస్తుండగా.. సిరాజ్, ఇషాంత్‌శర్మతో కలిసి ప్రసిద్ధ్ పేస్ భారాన్ని మోస్తూ జట్టును గెలిపిస్తున్నాడు. అత్యధిక వికెట్లు తీసి టాప్ -3లో ప్రసిద్ధ్ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మెగా వేలంలో రూ.9.50 కోట్లు వెచ్చించి గుజరాత్ తీసుకుంది. ఇప్పటివరకు 8 మ్యాచుల్లో 16 వికెట్లు పడగొట్టాడు. ఇందులో తనకు కేఎల్ రాహుల్ వికెట్ ఎంతో ఇష్టమని ప్రసిద్ధ్ వ్యాఖ్యానించాడు. అలాగే లాలాజలంతో పేసర్లకు అదనపు ప్రయోజనం దక్కుతుందని పేర్కొన్నాడు.**

"ఈ సీజన్‌లో నేనేమీ కొత్తగా చేయడం లేదు. నా సన్నద్ధత గతం కంటే బాగుంది. నేను దేనిమీద మెరుగుకావాలనే దానిపై దృష్టిపెట్టా. గంటలతరబడి ఆశిశ్ నెహ్రాతో సంభాషించా. కొద్ది నెలల్లోనే అతడి నుంచి కీలక విషయాలను నేర్చుకున్నా. పరిస్థితులను త్వరగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాం. అత్యుత్తమ ఫామ్‌లో ఉన్నప్పుడు సరైన నిర్ణయాలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ఇలాంటి విషయాలు చాలా సాయం చేస్తాయి. మనలో ఆత్మవిశ్వాసం పెరిగేందుకు కారణం కూడా ఇదే. అప్పుడు మరిన్ని మ్యాచుల్లో మన జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించేందుకు అవకాశం దొరుకుతుంది. ఇప్పుడు నా ఫిట్‌నెస్ బాగుంది. మరింత క్రికెట్ ఆడగలననే నమ్మకం ఉంది. మైదానంలో ఆటను ఆస్వాదిస్తున్నా. సుదీర్ఘమైన, పరిమిత ఓవర్ల క్రికెట్‌కు చాలా వ్యత్యాసం ఉంటుంది. మంచి ఫామ్‌లో ఉంటే సరైన లెంగ్త్‌తో బౌలింగ్ చేయొచ్చు. బంతిపై పట్టుంటే ఏ ఫార్మాట్‌లోనైనా ఆడొచ్చు. వికెట్లు రావడమనేది ఆటలో భాగం. బౌలింగ్ బాగా చేయడమే ముఖ్యం. ఇప్పటివరకు ఈ సీజన్‌లో నేను తీసిన 16 వికెట్లలో కేఎల్ రాహుల్‌ను ఔట్ చేయడం నచ్చింది. అదే నా ఫేవరెట్ వికెట్. తీవ్ర ఒత్తిడిలో బంతి చాలా లేట్‌గా స్వింగ్ అయి వికెట్ వచ్చేలా చేసింది. కేఎల్ ఔట్ కావడంతోనే మ్యాచ్ మావైపు తిరిగింది. అందుకే, కేఎల్ వికెట్ నా ఫేవరెట్ అని చెబుతా" అని ప్రసిద్ధ్ వెల్లడించాడు.

#### లాలాజలం వల్ల ఉపయోగమే..

"ఉమ్ము వాడకం వల్ల ఫాస్ట్ బౌలర్లకు అదనపు ప్రయోజనం ఉంటుందనేది నా భావన. 120 బంతుల్లో ఒక్కటైనా కాస్త ఎక్కువగా స్వింగ్ కావడం లేదా పేస్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెడితే వికెట్ దక్కితే మ్యాచ్ మొత్తం మారిపోయే అవకాశం ఉంటుంది. లేకపోతే డాట్ బాల్ అయినా సరే కీలక దశలో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగలదు. ప్రత్యర్థి రన్‌రేట్ నెమ్మదిగా మారే ఛాన్స్ లేకపోలేదు" అని ప్రసిద్ధ్ వ్యాఖ్యానించాడు.

# శ్రీలంకపై భారత్ విజయం

### మహిళల ముక్కోణపు వన్డే సిరీస్

**కొలంబో: ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత మహిళల జట్టు శుభారంభం చేసింది. ఓపెనర్ ప్రతీక రావల్‌తో పాటు స్పిన్నర్లు రాణించడంతో ఆదివారం వర్ష ప్రభావిత తొలి మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం సాధించింది. వర్షం కారణంగా ఇన్నింగ్స్‌ను 39 ఓవర్లకు కుదించారు.**



స్నేహ్ రాణా

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక.. స్నేహ్ రాణా (3/31), శ్రీ చరణి (2/26), దీప్తి శర్మ (2/22)ల ధాటికి 38.1 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన లంక.. పరుగుల కోసం చెమటోడ్చింది. హాసిని పెరీరా (30బీ 46 బంతుల్లో 4ఐ4) టాప్ స్కోరర్. కవిషా 25 పరుగులు చేసింది. ప్రతీక రావల్ (50 నాటౌట్‌బీ 62 బంతుల్లో 7ఐ4) మెరవడంతో లక్ష్యాన్ని భారత్ 29.4 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి అలవోకగా ఛేదించింది. స్మృతి మంధాన (43బీ 46 బంతుల్లో 6ఐ4), హర్లీన్ డియోల్ (48 నాటౌట్‌బీ 71 బంతుల్లో 4ఐ4) కూడా సత్తా చాటారు. ఛేదనలో భారత్‌పై లంక బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. కెరీర్‌లో ఏడో వన్డే ఆడిన ప్రతీక.. సాధికారికంగా బ్యాటింగ్ చేసింది. స్మృతితో తొలి వికెట్‌కు 54, హర్లీన్‌తో అభేద్యమైన రెండో వికెట్‌కు 95 పరుగులు జోడించి జట్టును విజయపథంలో నడిపించింది. భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాను ఢీకొంటుంది.

# పంత్ పేలవ ఫామ్‌కు అదేమీ కారణం కాదు

### జహీర్ ఖాన్



**లఖ్‌నవూ : ఐపీఎల్ 2025 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ 10 మ్యాచుల్లో 110 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒక్క హాఫ్ సెంచరీ (63) ఉంది. మిగిలిన తొమ్మిదింట్లో కేవలం 47 పరుగులే చేయడం గమనార్హం. ఐపీఎల్ మెగా వేలంలో రూ.27 కోట్లను సొంతం చేసుకున్న అతడు పేలవ ఫామ్‌ను కొనసాగించడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. భారీ ప్రైస్ ట్యాగ్ వల్లనే అతడు ఇబ్బందిపడుతున్నాడనే వ్యాఖ్యలు వినిపించాయి. వాటికి లఖ్‌నవూ మెంటార్ జహీర్ ఖాన్ సమాధానం ఇచ్చాడు.**

"ధరకు, ఆటకు ఎలాంటి ముడిపెట్టను. పంత్ అద్భుతమైన నాయకుడు. ఆ విషయంలో నేను హామీ ఇవ్వగలను. సారథిగా అతడి పనితీరు బాగుంది. బ్యాటర్‌గా మాత్రం పంత్ నుంచి ఇంకా మంచి ఇన్నింగ్స్ రాలేదు. మిడిలార్డర్‌లో రానున్న మ్యాచుల్లో తప్పకుండా అతడు ప్రభావం చూపిస్తాడని భావిస్తున్నా. ఒక్కసారి క్లిక్ అయితే చాలు అతడిని ఆపడం కష్టం. ప్రైస్ ట్యాగ్‌తో ఒత్తిడిగా ఫీలవుతున్నాడని అనుకోవడం లేదు. అతడిది అలాంటి వ్యక్తిత్వం కాదు. గత మ్యాచులో ఏం జరిగిందో అది ముగిసిన పేజీ. తర్వాత ఏమి జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. పంత్ చాలా ఆశావాద క్రికెటర్. సానుకూలంగా ఉండే వ్యక్తి. మా నుంచి ఎప్పుడూ అతనికి మద్దతు దొరుకుతూనే ఉంటుంది" అని జహీర్ వెల్లడించాడు.

#### నెట్‌రన్‌రేట్ పైనా దృష్టి..

"మేం ఇప్పటివరకు 10 మ్యాచులు ఆడాం. అందులో ఐదు గెలిచాం. ఇంకా నాలుగు మ్యాచులు ఉన్నాయి. కనీసం మూడింట్లో విజయం సాధిస్తే ప్లేఆఫ్స్‌కు చేరుకొనేందుకు అవకాశం ఉంటుంది. దాంతో నెట్‌రన్‌రేట్ కీలకమని మాకు తెలుసు. టోర్నీ గెలవాలంటే మంచి క్రికెట్ ఆడాలి. తప్పకుండా మేం ఆ దిశగా అడుగులు వేస్తామని భావిస్తున్నా. అలాంటి వాతావరణం ఇప్పటికే జట్టులో ఉంది" అని వ్యాఖ్యానించాడు.

# ధోని ఇంకో సీజన్ ఆడతాడు: రైనా



**చెన్నై: ఈ సీజన్లో పేలవ ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో అట్టడుగున కొనసాగుతోంది చెన్నై సూపర్ కింగ్స్. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయపడడంతో సీజన్ మధ్యలో పగ్గాలందుకున్న ధోని కూడా ఆ జట్టు రాత మార్చలేకపోయాడు. ధోని వ్యక్తిగత ప్రదర్శన కూడా గొప్పగా లేకపోవడంతో ఇంకో సీజన్‌కు అతను కొనసాగడంపై సందేహాలు నెలకొన్నాయి. కానీ మహి ఇంకో సీజన్ ఆడతాడని అంటున్నాడు సీఎస్కే జట్టులో తన మాజీ సహచరుడు సురేశ్ రైనా. వచ్చే ఏడాది చెన్నై ఆట మెరుగుపడుతుందని కూడా అతను ఆశాభావం వ్యక్తం చేశాడు.**

"వచ్చే ఏడాది చెన్నై మెరుగైన ప్రణాళికతో బరిలోకి దిగుతుందనుకుంటున్నా. ధోని కచ్చితంగా ఇంకో సీజన్ ఆడతాడు. వేలంలో అన్నీ ధోనీనే చూసుకుంటాడని చాలామంది అంటుంటారు. అయితే నేను వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. ఎవరిని అట్టిపెట్టుకోవాలనే చర్చల్లో మాత్రమే ఉన్నా. నలుగురైదుగురు ఆటగాళ్ల విషయంలో మాత్రమే ధోని నిర్ణయం ఉంటుందనుకుంటా. అంతా తనే చూసుకుంటాడన్నది నిజం కాదు. ప్రస్తుతం 43 ఏళ్ల వయసులోనూ ధోని బ్యాటింగ్, వికెట్ కీపింగ్ చేస్తూ.. నాయకత్వం వహిస్తూ జట్టు భారాన్ని మోస్తున్నాడు" అని రైనా అన్నాడు.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# అక్టోబర్‌లో మళ్లీ థియేటర్లలోకి 'బాహుబలి'..

## నిర్మాత శోభు యార్లగడ్డ ప్రకటన

**ప్రభాస్ 'బాహుబలి' చిత్రం రీ-రిలీజ్ కు సిద్ధం**




భారతీయ సినీ చరిత్రలో సరికొత్త రికార్డులు సృష్టించిన పాన్-ఇండియా చిత్రం 'బాహుబలి'. ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా రెండో భాగం 'బాహుబలి 2: ది కన్‌క్లూజన్' విడుదలై ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా చిత్ర బృందం అభిమానులకు ఓ తీపి కబురు అందించింది. బాహుబలి చిత్రాన్ని మళ్లీ థియేటర్లలోకి తీసుకురానున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో భారత్‌తో పాటు అంతర్జాతీయంగా కూడా 'బాహుబలి'ని రీ-రిలీజ్ చేయనున్నట్లు నిర్మాత శోభు యార్లగడ్డ తెలిపారు. ఆర్కా మీడియా వర్క్స్ పతాకంపై 'బాహుబలి' చిత్రాన్ని నిర్మించిన శోభు యార్లగడ్డ, 'బాహుబలి 2' ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 28న సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. "ఈ ప్రత్యేకమైన రోజున, ఈ అక్టోబర్‌లో భారతదేశంలో, అంతర్జాతీయంగా 'బాహుబలి'ని రీ-రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నామని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఇది కేవలం రీ-రిలీజ్ మాత్రమే కాదు, మా ప్రియమైన అభిమానుల కోసం ఒక వేడుకల సంవత్సరం అవుతుంది! పాత జ్ఞాపకాలు, కొత్త విశేషాలు, కొన్ని అద్భుతమైన సర్‌ప్రైజ్‌లను ఆశించండి" అని ఆయన తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. 2017 ఏప్రిల్ 28న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన 'బాహుబలి 2', సుమారు రూ. 250 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి, ప్రపంచవ్యాప్తంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఆల్-టైమ్ రికార్డు సృష్టించింది. రూ. 1000 కోట్ల మార్కును దాటిన తొలి భారతీయ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో పాటు, విమర్శకుల ప్రశంసలు అందుకుని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు అవార్డులను సైతం గెలుచుకుంది. ఇప్పుడు మళ్లీ ఈ చిత్రాన్ని వెండితెరపై చూసే అవకాశం అభిమానులకు కలగనుంది.

# కిల్లర్ లుక్స్‌తో అవంతిక



హాలీవుడ్ లో మెరుస్తున్న తెలుగు అమ్మాయి అవంతిక వందనపు. టాలీవుడ్ నుండి హాలీవుడ్ వరకు విభిన్న సంస్కృతులతో ప్రత్యక్ష పరిచయం ఉన్న ఈ బ్యూటీ.. గ్లోబల్ స్టార్‌డమ్ వైపు వడి వడిగా దూసుకుపోతోంది. మహేష్ బాబు బ్రహ్మోత్సవంలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా టాలీవుడ్ అరంగేట్రం చేసిన అవంతిక.. మీన్ గర్ల్స్ తో హాలీవుడ్ లోను సెన్సేషన్ గా మారింది. ఇందులో కరెన్ శెట్టిగా బ్రేకవుట్ పాత్రను పోషించిన అవంతిక ప్రతిభకు మంచి గుర్తింపు దక్కింది. ఇదిలా ఉండగా అవంతిక సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తాజా ఫోటోలు వైరల్ గా మారాయి. పార్టీవేర్ డ్రెస్‌లో మెరిసిన అవంతిక తన కిల్లర్ లుక్స్ తో ఆకట్టుకుంది.

# ఏపీలోని బాపట్లలో నటి సమంతకు ఆలయం

**ఆలయంలో సమంత బంగారు రంగు విగ్రహం ఏర్పాటు - సమంత పుట్టినరోజున గుడి వద్ద కేక్ కటింగ్, అన్నదానం**

సినీ తారలపై అభిమానాన్ని చాటుకోవడంలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి. కొందరు కటౌట్లు, పాలాభిషేకాలతో తమ ప్రేమను చాటుకుంటే, మరికొందరు సేవా కార్యక్రమాలు చేపడుతుంటారు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లాకు చెందిన సందీప్ అనే అభిమాని తన ఆరాధ్య నటి సమంతపై ఉన్న ప్రేమను వినూత్నంగా ప్రదర్శించారు. ఏకంగా ఆమెకు ఓ ఆలయాన్ని నిర్మించి, అందులో సమంత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వివరాల్లోకి వెళితే, బాపట్లకు చెందిన ఈ వీరాభిమాని, నటి సమంతకు ఒక చిన్న ఆలయాన్ని నిర్మించారు.



అందులో బంగారు రంగులో ఉన్న సమంత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం (ఏప్రిల్ 28) సమంత పుట్టినరోజు సందర్భంగా ఈ ఆలయం వద్ద ఆయన ప్రత్యేకంగా వేడుకలు నిర్వహించారు. సమంత విగ్రహం ముందు కేక్ కట్ చేసి, తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కొందరికి అన్నదానం కూడా చేశారు. ఈ అభిమాని సమంతకు గుడి కట్టడం, పుట్టినరోజున కేక్ కట్ చేసి, అన్నదానం చేయడం వంటి దృశ్యాలతో కూడిన వీడియో ఒకటి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలో ఉంది (వైరల్ అవుతోంది). ఈ వీడియోపై నెటిజన్లు, సమంత అభిమానులు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు అభిమాని చేసిన పనిని, నటిపై ఆయనకున్న ప్రేమను ప్రశంసిస్తుండగా, మరికొందరు ఇలాంటి అతి ఆరాధన అవసరమా అని ప్రశ్నిస్తూ, విమర్శలు చేస్తున్నారు. గతంలో తమిళనాడులో నటీమణులు కుష్బు, నయనతార, హన్సిక వంటి వారికి కూడా కొందరు







అభిమానులు గుడులు కట్టిన సందర్భాలున్నాయి. తాజాగా ఆంధ్రప్రదేశ్‌లో సమంతకు అభిమాని గుడి కట్టడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం నటిగా విరామం తీసుకున్న సమంత, నిర్మాతగా వ్యవహరిస్తున్న ఓ సినిమాతో త్వరలో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఆమె త్వరలోనే ఓ భారీ చిత్రంతో నటిగా రీఎంట్రీ ఇవ్వనుందనే ప్రచారం కూడా జరుగుతోంది.

# నాని అభిమానులకు రాజమౌళి గుడ్ న్యూస్

**రాజమౌళి 'మహాభారతం' ప్రాజెక్ట్‌లో నాని**

**హైదరాబాద్‌లో 'హిట్ 3' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో జక్కన్న ప్రకటన**




**పాత్ర ఇంకా నిర్ణయించలేదు, కానీ నాని ఉండటం పక్కా అని వెల్లడి**

**రాజమౌళి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా 'మహాభారతం'**

**గతంలో 'ఈగ'లో కలిసి పనిచేసిన రాజమౌళి, నాని**

భారతీయ సినీ పరిశ్రమ గర్వించదగ్గ దర్శకుల్లో ఒకరైన ఎస్.ఎస్. రాజమౌళి తన ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'మహాభారతం' గురించి కీలక ప్రకటన చేశారు. ఈ భారీ చిత్రంలో నేచురల్ స్టార్ నాని భాగం కానున్నారని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన 'హిట్: ది థర్డ్ కేస్' సినిమా ప్రీ-రిలీజ్ వేడుకలో రాజమౌళి ఈ విషయాన్ని వెల్లడించారు. మహాభారత ఇతిహాసాన్ని పది భాగాలుగా తెరకెక్కించాలనేది తన కల అని రాజమౌళి గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. 'హిట్ 3' వేడుకలో యాంకర్ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా రాజమౌళి మాట్లాడుతూ.. "మహాభారతంలో నానికి పాత్ర ఇంకా ఖరారు కాలేదు కానీ, అతను కచ్చితంగా ఈ ప్రాజెక్ట్‌లో ఉంటాడు" అని తెలిపారు. దీంతో ఈ డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నాని ఉండటం ఖాయమని తేలిపోయింది. గతంలో రాజమౌళి దర్శకత్వంలో వచ్చిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ఈగ'లో నాని నటించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబుతో %ూవీదీ%29 అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా చిత్రీకరణ ఒడిశాతో పాటు పలు ప్రాంతాల్లో జరుగుతోంది. ఈ సినిమా తర్వాత రాజమౌళి 'మహాభారతం' ప్రాజెక్ట్‌పై దృష్టి సారించే అవకాశం ఉంది.'హిట్ 3' వేడుకలో నాని మాట్లాడుతూ రాజమౌళి సినిమాలపై తనకున్న నమ్మకాన్ని సరదాగా వ్యక్తం చేశారు. రాజమౌళి వంటి అగ్ర దర్శకుడు తన డ్రీమ్ ప్రాజెక్ట్‌లో నానికి స్థానం కల్పించడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ వార్త నాని అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

# సినిమా కోసం చేశా.. మీరు అనుకరించొద్దు ప్లీజ్: సూర్య

**సినిమాలో సిగరెట్ నిజ జీవితంలో వద్దన్న సూర్య**

**తన తదుపరి చిత్రం 'రెట్రో'లో కొన్ని సన్నివేశాల్లో ధూమపానం** చేసినప్పటికీ, నిజ జీవితంలో ఆ అలవాటుకు దూరంగా ఉండాలని నటుడు సూర్య తన అభిమానులకు గట్టిగా సూచించారు. తిరువనంతపురంలోని లులూ మాల్‌లో జరిగిన 'రెట్రో' ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఒక చిన్న హెచ్చరిక. నేను కేవలం సినిమా అవసరం కోసమే సిగరెట్లు కాల్చాను. దయచేసి మీ నిజ జీవితంలో ఎవరూ పొగతాగకండి" అని సూర్య స్పష్టం చేశారు. పొగతాగడం ఒకసారి మొదలుపెడితే సులభంగా వదిలించుకోలేని వ్యసనంగా మారుతుందని ఆయన హెచ్చరించారు. "ఒక్క పఫ్ లేదా ఒక్క సిగరెట్‌తో మొదలుపెడతారు. కానీ ప్రారంభించాక దాన్ని ఆపడం చాలా కష్టం. నేను దీన్ని కచ్చితంగా ప్రోత్సహించను, మీరు కూడా చేయకండి" అని ఆయన హితవు పలికారు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ 'రెట్రో' చిత్రం, తాను గతంలో చేసిన 45 సినిమాలకు భిన్నంగా ఉంటుందని సూర్య తెలిపారు. కార్తీక్‌తో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ చిత్రంలో సూర్యతో పాటు పూజా హెగ్డే, మలయాళ నటులు జోజు జార్జ్, జయరామ్ తదితరులు నటిస్తున్నారు. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్నారు.



# మే 8 నుంచి అమెరికాలో 'కన్నప్ప' టీమ్ ప్రచారం

**మంచు విష్ణు, ముకేశ్ కుమార్ సింగ్ కాంబోలో 'కన్నప్ప'**

**జూన్ 27న విడుదల కానున్న సినిమా**

**ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోన్న చిత్రబృందం**

**న్యూజెర్సీలో రోడ్‌షోతో పాటు డల్లాస్, లాస్ ఏంజిల్స్‌లలో ఈవెంట్స్**

మంచు విష్ణు, మోహన్ బాబుల డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' జూన్ 27న పాన్ ఇండియా స్థాయిలో వివిధ భాషల్లో విడుదలకు సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. దీంతో చిత్రబృందం ప్రస్తుతం ముమ్మరంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మే 8వ తేదీ నుంచి అమెరికాలో ప్రమోషన్స్‌కు సిద్ధమవుతోంది. న్యూజెర్సీలో రోడ్‌షోతో పాటు డల్లాస్, లాస్ ఏంజిల్స్‌లలో ఈవెంట్స్ ఉంటాయని తాజాగా మేకర్స్ ప్రకటించారు. ముకేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'కన్నప్ప'లో విష్ణు సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తోంది. మంచు మోహన్ బాబుతో పాటు మోహన్ లాల్, అక్షయ్ కుమార్, ప్రభాస్, కాజల్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక, ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు మంచి స్పందన వచ్చిన విషయం తెలిసిందే.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339